ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
బుధవారం 30 జూలై 2025 | 5

అలలు ఎగసి..
రోడ్డును ఛిద్రం చేసి..
» కొత్తపట్నం వద్ద ధ్వంసమైన రహదారి
» గోతుల్లో పడి గాయాలపాలవుతున్న వాహనచోదకులు 6

ఏం కావాలో తెలుసుకోండి?

- » నేటి నుంచి కాకినాడ, కోనసీమ జిల్లాల్లో కుటుంబ అవసరాల సర్వే ప్రారంభం
- » తూరుగోదావరి జిల్లాలో రేపు లేదా ఎల్లుండి నుంచి సర్వేకు సన్నాహాలు
- » ఉమ్మడి 'తూర్పు'లో పీ4 బంగారు కుటుంబాల దత్తత లక్ష్యం 2లక్షల19వేలు
- » ఇప్పటివరకు 62వేల బంగారు కుటుంబాల దత్తత స్వీకరణ
- » సర్వే కోసం ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం
- » మిగిలినవారికి సరిపడగా మార్గదర్శులను గుర్తించే పనిలో అధికారులు
- » ఆగస్టు 15 కల్లా ప్రక్రియ పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు

7

ఏలేరుకు గోదావరి జలాలు



ఏలేశ్వరం మండలంలోని ఏలేరు ప్రాజెక్టులోకి పైపుల ద్వారా విడుదల అవుతున్న గోదావరి జలాలు 7



కాకినాడ కార్పొరేషన్ సమావేశమందిరంలో శిక్షణ ఇస్తున్న అధికారులు(ఫైల్)

ఆస్తులకు.. ఆటోమ్యూటేషన్

- » 1 నుంచి కార్పొరేషన్‌లో అమలు
- » ఇకపై అవినీతికి, ఆలస్యానికి చెక్
- » రిజిస్ట్రేషన్లు పూర్తయిన వెంటనే పేరు మార్పు
- » పటిష్టంగా అమలుకు చర్యలు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆస్తుల మార్పునకు, అవినీతి వ్యవహారాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముందుగా రాష్ట్రంలోని 17కార్పొరేషన్లలో ఆస్తులకు ఆటోమ్యూటేషన్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంతోపాటు సమయం ఆదా అవుతుంది. ఈ విధానం ఇప్పటికే విజయవాడ నగరంలో విజయవంతం కావడంతో అన్ని కార్పొరేషన్లలో ఆగస్టు 1 నుంచి అమల్లోకి తెస్తున్నారు. కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేశారు.

ఇప్పటివరకు ఇలా..

ఆస్తులు కొనుగోలు చేసిన తర్వాత వారి పేర్లపై హక్కులను బదలాయించడం కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ముగుస్తుంది. ఆ తర్వాత కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లాలి. ఇంటి, కుళాయి పన్ను రశీదుల్లో పేరు మార్పు కోసం మార్కెట్‌లో ఆ ఆస్తి విలువలో ఒకశాతం మ్యూటేషన్ ఫీజుగా చలానా చెల్లించి సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. సచివాలయంలో డాక్యుమెంట్లు పొందుపరిచిన తర్వాత ఆర్ఐ, ఆర్‌వో లాగిన్లలో ప్రక్రియ పూర్తయి చివరికి కమిషనర్ లాగిన్‌కు చేరుతుంది. అందుకోసం రోజుల తరబడి తిరగడంతోపాటు రెవెన్యూ సెక్షన్ అధికారులను ప్రసన్నం చేసుకోవాలి. అవసరమైతే వారడిగినంతా చెల్లించుకోవాలి. ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం 14 రోజుల్లో ఈ మొత్తం ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది. రెవెన్యూ సిబ్బంది ఆశీస్సుల కోసం రోజులు, నెలల తరబడి కూడా తిరగాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఆటోమ్యూటేషన్‌తో ఆ కష్టాలు తీరనున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆస్తి బదలాయింపుతోనే అన్ని ప్రక్రియలు ఆటోమేటిక్‌గా పూర్తవుతాయి.

నూతన విధానంలో ఇలా..

ఆటోమ్యుటేషన్ అందుబాటులోకివస్తే ఆస్తి కొనుగోలు చేసిన వ్యక్తి మ్యుటేషన్‌కోసం కార్పొరేషన్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆస్తి విలువలో ఒకశాతం చలానా చెల్లిస్తే చాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే ఆ ప్రక్రియ పూర్తవుతుంది. రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్‌లో జరగ్గానే ఆటోమేటిక్‌గా ఆ డాక్యుమెంట్లు నేరుగా కమిషనర్‌కు లాగిన్‌కు చేరుతాయి. ఆయన పరిశీలించి ఓకే చేసిన వెంటనే ఆస్తిని కొనుగోలు చేసిన యజమాని పేరుపైనే ఆన్‌లైన్‌లో మారిపోతుంది. ఇందుకు సంబంధించి ఆయా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాలేషన్ జరగాల్సి ఉంది. అందుకోసం ప్రభుత్వశాఖ నుంచి సబ్‌రిజిస్ట్రార్లు, కార్పొరేషన్ అధికారులకు మౌఖిక ఆదేశాలు అందాయి. ఈ మేరకు కాకినాడ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఆస్తులకు ఆటో మ్యుటేషన్‌పై సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చారు.

కార్పొరేషన్‌కి ఆదాయం

ఇప్పటివరకు కార్పొరేషన్ పరిధిలో ఖాళీ స్థలాలు రిజిస్ట్రేషన్ అయినప్పటికీ స్థల యజమానులు పన్ను వేయించుకునే వారు కాదు. ఈఆటోమ్యుటేషన్ ద్వారా వెంటనే కొనుగోలుదారుల పేరు మీద డాక్యుమెంటేషన్ అవుతుంది కాబట్టి వారిని గుర్తించి పన్నులు వేయించడం ద్వారా కార్పొరేషన్‌లకు ఆదాయం సమకూరుతుంది. సంబంధిత ఆస్తిపై వాటర్ చార్జెస్ కానీ ఆస్తి పన్ను లు కానీ ఏమన్నా వెంటనే కట్టుకున్న తర్వాత మాత్రమే రిజిస్ట్రేషన్ తర్వాత ఈ ఆటోమ్యూటేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈఅవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలి.

-కోన శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్
నగరపాలక సంస్థ, కాకినాడ



నోట్లు.. కట్టలు..గుట్టలు!

బ్యాంకుల్లో అన్ క్లయిమ్డ్ డిపాజిట్లు

ఉమ్మడి జిల్లాలో 145 కోట్లు

- » ఉమ్మడి జిల్లాలో రూ.145కోట్లపైనే
- » పదేళ్లపైనుంచీ ఖాతాల్లో డబ్బులు
- » బ్యాంకుల్లో లావాదేవీలు నిల్
- » అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లుగా గుర్తింపు
- » ప్రభుత్వ బ్యాంకుల్లో రూ.90 కోట్లు
- » ఆ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ,ఐసీఐసీఐ
- » 330 బ్రాంచ్‌ల్లో కోట్లు
- » ఆర్‌బీఐకి పంపేసిన బ్యాంకులు
- » ఆధారాలతో వెళితే ఇచ్చేస్తారు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పదేళ్లకుపైగా ఏ మాత్రం లావాదేవీలు జరగని అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లు రూ.145 కోట్లకుపైగా ఉన్నట్టు అంచనా వేశారు. ఈ డబ్బు కోసం పదేళ్ల నుంచీ ఎవరూ రాకపోవడంతో వాటిని ఆర్‌బీఐకి పంపేశారు. స్టేట్‌బ్యాంకు, యూనియన్ బ్యాంకు, గ్రామీణ బ్యాంకు తదితర ప్రభుత్వరంగ బ్యాంకు బ్రాంచ్‌ల్లో రూ.90 కోట్ల వరకు డబ్బు పేరుకుపోయింది. ఆ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ తదితర బ్యాంకుల్లో రూ.35 కోట్ల వరకు నగదు ఉండిపోయింది. కొన్ని బ్యాంకు ఖాతాల్లో రూ.లక్షల్లో నగదు ఉండిపోయినట్టు బ్యాంకులు గుర్తించాయి. అత్యధికంగా ఈ తరహా కేసులు నగరాలు, పట్టణాల పరిధిలో ఉన్నట్టు బ్యాంకులు విశ్లేషించాయి. ఆర్‌బీఐకి బదిలీ చేసిన తర్వాత ఖాతాలో బయటకు సున్నా బ్యాలెన్స్ చూపిస్తుంది. అందులో ఉండిపోయిన నగదు ఆర్‌బీఐ వద్దే ఉంటుంది.

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో బ్యాంకుల్లో జనం డబ్బు మూలుగుతోంది. ఏళ్ల తరబడి తీయకపోవడంతో కోట్లకు కోట్లు పేరుకుపోతోంది. ఒకటి కాదు రెండుకాదు... పదేళ్లకుపైగా ఆయా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు తీయకపోవడంతో అవన్నీ అన్ క్లయిమ్డ్ డిపాజిట్లుగా మారిపోతున్నాయి. ఆ డబ్బులను బ్యాంకులు చూసీచూసీ ఆర్‌బీఐకి పంపించేస్తున్నాయి. ఇలా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 35 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన 330 బ్రాంచ్‌ల్లో దాదాపుగా రూ.145 కోట్లకుపైగా నగదు అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లుగా బ్యాంకులు గుర్తించాయి. అత్యధికంగా ఎస్‌బీఐ, యూబీఐ తదితర బ్యాంకుల్లో డబ్బులు కోట్లలో పోగుపడగా, తర్వాత ప్రైవేటుబ్యాంకుల్లోను ఉన్నాయి.

పదేళ్లు దాటితే అంతే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ,ప్రైవేటు బ్యాంకులు 35 వరకు ఉండగా వీటన్నింటికి కలిపి 330 వరకు బ్రాంచ్‌లు న్నాయి. వీటిలో ప్రజలు మొత్తం రూ.48,500 కోట్ల వరకు డిపాజిట్లు చేశారు. ఒక్క కాకినాడ జిల్లాలోనే రూ.21,307 కోట్లు ఉన్నాయి. ఖాతాదారులు సేవింగ్స్ కరెంట్ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో డబ్బులు పొదుపు చేస్తారు. తరచూ ఖాతాలో డబ్బులు జమ చేయడం, విత్‌డ్రా చేసుకోవడం జరుగుతుంది. కానీ కొన్ని సేవింగ్స్ కరెంట్ ఖాతాలు మాత్రం ఏళ్ల తరబడి అసలు ఏ లావాదేవీ జరగకుండా ఉండిపోతున్నాయి. వీటిలో ఉన్న డబ్బులను విత్‌డ్రా చేసుకోవడానికి ఎవరూ రావడం లేదు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు ఇలా ఏలావాదేవీ జరగని బ్యాంకు ఖాతాలపై ఆయా బ్రాంచ్‌లు కన్నేసి ఉంచుతాయి. తొలుత రెండేళ్ల పాటు ఏ లావాదేవీ జరగని ఖాతాలుంటే వాటిని నిర్వహణలో లేని ఖాతాగా గుర్తిస్తారు. బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉండి కూడా పదేళ్ల వరకు వాటిపై ఏలావాదేవీ జరగకపోతే దాన్ని అన్‌క్లయిమ్డ్‌గా భావిస్తారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఇలా పదేళ్ల పాటు ఉండిపోయిన బ్యాంకు ఖాతాలను ఆయా బ్యాంకులు ఆర్‌బీఐకి పంపాల్సి ఉంటుంది. దీన్నే డీఈఏ (డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్)గా పిలుస్తారు. ఒకవేళ ఆర్‌బీఐకి ఈ తరహా బ్యాంకు ఖాతాలను పంపకపోతే అందులో ఉన్న ఖాతాదారుల డబ్బు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉన్నందున పదేళ్లు దాటిన ఖాతాల సొమ్మును ఆర్‌బీఐకి బ్యాంకులు పంపుతాయి.

తెలియక కొండలా..

ఖాతాదారుడి అకౌంట్‌లో డబ్బులు ఉన్నా ఆ తర్వాత చనిపోయిన ఘటనల్లో ఈ తరహా డిపాజిట్లు పేరుకుపోతున్నట్టు లీడ్‌బ్యాంకు అధికారులు వివరించారు. ఖాతాదారుడు అవివాహితుడో.. లేదంటే గుర్తుతెలియని ప్రదేశాల్లో చనిపోయి ఇప్పటికీ ఆచూకీ దొరకని ఘటనలు, ఖాతాదారుడు చనిపోగా, పిల్లలు,ఇతర రక్తసంబంధీకులు విదేశాల్లో ఉండిపోయి ఇక్కడకు రాని ఘటనల్లో ఈ తరహా అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లు పెరుగుతున్నట్టు పేర్కొన్నారు. ఖాతాదారుడి అకౌంట్లో డబ్బులున్నా సదరు వ్యక్తి మరణం తర్వాత ఆ విషయం వారసులకు తెలియని ఘటనలు సైతం ఇందుకు దోహదం చేస్తున్నాయని తెలిపారు. కొందరు ఖాతాల్లో డబ్బులున్నట్టు గుర్తించి విత్‌డ్రాకు ప్రయత్నిస్తున్నా వారసత్వ ధ్రువీకరణ విషయంలో ఇబ్బందులు ఇందుకు కొంత కారణంగా మారుతున్నాయి. అనేకమంది ఫలానా ఖాతా తమ వారిదేనని వస్తున్నా అందుకుతగ్గ సరైన ఆధారాలు చూపడం లేదని బ్యాంకులు పేర్కొంటున్నాయి.

కొవిడ్ తర్వాత ఇలా..

కొవిడ్ తర్వాత అనేక బ్యాంకు ఖాతాలు అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లుగా మారినట్టు బ్యాంకులు చెబుతున్నాయి. రిజర్వుబ్యాంకు ఆదేశాల మేరకు 2023లో 100 రోజులు 100 పేమెంట్స్ కింద అన్‌క్లయిమ్డ్ డిపాజిట్లు తిరిగి చెల్లించేందుకు శ్రీకారం చుట్టింది.ప్రతి జిల్లాలో ప్రతి బ్యాంకు తమ టాప్ 100 అన్ క్లెయిమ్ డిపాజిట్లకు సంబంధించి ఖాతాదారులను గుర్తించి నగదు సెటిల్ చేయాలని కోరింది. కానీ ఉమ్మడి జిల్లాలో పెద్దగా ఈ ప్రయోగం ఫలించలేదు. ఖాతాదారులకు అందించేందుకు ఆర్‌బీఐ ఉద్గమ్ (అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు -గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్)పేరిట సెంట్రల్ వెబ్ పోర్టల్‌ను 2023 ఆగస్టులో ప్రారంభించింది. దీని ద్వారా రిజిస్టర్ వినియోగదారులు అన్ని బ్యాంకుల్లోని అన్ క్లెయిమ్డ్ డిపాజిట్ల సమాచారం పొందేలా వివరాలు ఉంచింది.ఎవరికైనా అనుమానం ఉంటే రిజి స్టర్ అయి చెక్ చేసుకోవచ్చని సమాచారం. లేదంటే బ్యాంకులకు వెళ్లి వివరాలు కోరినా చెప్పే అవకాశం ఉంది.

ఆటోమ్యూటేషన్‌తో పన్నుల్లో పేరు మార్పు: కమిషనర్



కార్పొరేషన్(కాకినాడ), జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడనగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు, ఆస్తిపన్ను పేరు మార్పునకు ఆటోమ్యూటేషన్ విధానంతో సులభతరమైన, వేగవంతమైన సేవలు అందుబాటులోకి రానున్నట్లు కమిషనర్ భావన తెలిపారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో, ఆస్తి యజమానిపై పన్ను పేరు మార్పులకు జరుగుతున్న ఇబ్బందులు, జాప్యం తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని ఆమె అన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే విజయవాడలో ప్రతిష్టాత్మకంగా ఆటోమ్యూటేషన్ విధానం అమలు చేస్తుండగా వచ్చిన ఫలితాలతో మొదటగా రాష్ట్రంలోని అన్నికార్పొరేషన్లలో ఈ విధానం ఆగస్టు 1 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. దీంతో ఇకపై ఆస్తుల కొనుగోలు, అమ్మకాలు జరిగినపుడు పన్ను పేరుమార్పునకు కార్పొరేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో ఆస్తి, ఖాళీ స్థలాలపై ఉన్న పాత బకాయి చెల్లించి, పన్ను, పేరు మార్పునకు సంబంధించి మ్యూటేషన్ ఛార్జీలు చెల్లించిన వెంటనే పన్ను, పేరు మార్పు పత్రాలను కాలయాపన లేకుండా పొందవచ్చునని తెలిపారు.

ఫుడ్ లైసెన్సు లేకుండా వ్యాపారాలు

- » తనిఖీల్లో గుర్తించిన అధికారులు
- » జేసీ కోర్టులో జరిమానా

కలెక్టరేట్(కాకినాడ), జూలై 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫుడ్ లైసెన్సులు లేకుండా ఆహారపదార్థాలను విక్రయిస్తున్న ఆరుగురు వ్యాపారులపై జిల్లా జేసీ కోర్టులో జరిమానా విధించారు. ఇటీవల ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు జిల్లాలో ఆహార పదార్థాలను విక్రయించే దుకాణాలపై దాడులు చేసి తనిఖీలు నిర్వహించారు. కొంతమందివద్ద ఫుడ్ లైసెన్సులు లేకపోవడంతో వాటిపై కేసులు నమోదు చేశారు. వాటికి మంగళవారం జిల్లా అదనపు మెజిస్ట్రేట్ హోదాలో జేసీ రాహుల్‌మీనా ఆరుగురు వ్యాపారులకు రూ.67వేల జరిమానా విధించారు. దీనిలో రాజస్థాన్ స్వీట్‌స్టాల్, సిరి టిఫెన్ సెంటర్, శ్రీసత్యదేవ ఆయిల్ ఫ్లోర్‌మిల్లు, జాబిలి దాబా, వీరబాబు పాన్‌షాపు,కామేశ్వరరావుదుకాణం ఉన్నాయి.

సామర్లకోట ఈటీసీలో జేసీ పరిశీలన

సామర్లకోట, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 1 నుంచి 12 వరకూ కాకినాడ జిల్లా కేంద్రంలో జరుగనున్న జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్ పోటీలకు వివిధ రాష్ట్రాలనుంచి క్రీడాకారులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం, సర్వే అకాడమీ ఆవరణలోని ప్రత్యేక వసతి సదుపాయాలను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా మంగళవారం పరిశీలించారు. జేసీ వెంట కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, ఈటీసీ ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు, సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, డీటీ వై.శ్రీనివాసు, వీఆర్వోలు నలజర్ల మురళీకృష్ణ, నూతలపాటి లోవరాజు, ఆదిబాబు పాల్గొన్నారు.



సామర్లకోట ఈటీసీ ఆవరణలో వసతిగృహాలను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌మీనా

'ఆడుదాం ఆంధ్ర'పై విజిలెన్స్ విచారణ

ప్రత్తిపాడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడోత్సవాల వ్యవహారంపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టింది. దీనిలోభాగంగా మంగళవారం విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కార్యాలయంలో విచారణ చేపట్టారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 'ఆడుదాం ఆంధ్ర'లో రూ.1.75లక్షల నిధులు విడుదల కాగా వీటిని ఎలా ఖర్చు చేశారనే దానిపై విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆరా తీశారు. ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు 'ఆడుదాం ఆంధ్ర'లో ప్రత్తిపాడు, ధర్మవరం, లంపకలోవ హైస్కూల్లో జరిగిన క్రీడా పోటీల వివరాలను, వాటికి సంబంధించిన ఖర్చులను విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌కు వివరించారు.

అక్రమ రవాణాను అడ్డుకుంటాం

- » 'రైస్.. రైట్'పై స్పందించిన పౌరసరఫరాలశాఖ అధికారులు
- » ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కాకినాడ, జూలై 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్‌బియ్యం అక్రమ రవాణా ఆగలేదని, ఎక్కడిక్కడ బియ్యం నిల్వలు పట్టుబడుతూనే ఉన్నాయని, పౌరసరఫరాలశాఖ, పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా, డిప్యూటీ సీఎం, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎంత హెచ్చరించినా రేషన్ మాఫియా తగ్గడం లేదంటూ.. ఇటీవల పలు చోట్ల కొన్ని రోజుల వ్యవధిలో పట్టుబడిన రేషన్ బియ్యం సంఘటనలను ఉదహరిస్తూ.. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో రైస్.. రైట్ శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో రేషన్‌బియ్యం అక్రమరవాణా విషయంపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని, 2025, జనవరి నుంచి ఇప్పటివరకు పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాకు సంబంధించి 48 కేసులు నమోదు చేసి 104.9మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలకు సిఫారసు చేశామని పేర్కొన్నారు. కాకినాడ పోర్టు పరిసరాల్లో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటలూ మూడు షిఫ్టుల్లో సిబ్బంది నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. జిల్లా కలెక్టర్, జేసీ, రెవెన్యూ, పోలీసు, పోర్టు అధికారులతో సమన్వయం చేసుకుంటూ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామని పౌరసరఫరాల అధికారులు స్పష్టం చేశారు.

దారి దోపిడీ ఘటనపై దర్యాప్తు ముమ్మరం
» విచారణకు 5 ప్రత్యేక బృందాలు
» సీసీ కెమెరాల పరిశీలన 7

గంజాయి కేసులో నలుగురి అరెస్ట్ 7

అదృశ్యమైన ఇద్దరు బాలికలు.. సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత 7

అరటి, కొబ్బరి తోటల నరికివేతపై దీక్ష 7

ఆర్టీసీ డ్రైవర్‌కు బంగారు పతకాలు 7

ఆర్మీ రిక్రూట్‌మెంట్ పారదర్శకంగా నిర్వహిస్తున్నాం 7
» దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దు
» విశాఖపట్నం ఆర్మీ అధికారులు

మహిళా హాకీ టోర్నీ, ఆర్మీ ర్యాలీ విజయవంతానికి కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

- » జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ),జూలై29(ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, మహిళా హాకీ టోర్నీలను విజయవంతంగా నిర్వహించేందుకు బుధవారం నుంచి జిల్లా క్రీడా మైదానంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, హాకీ టోర్నీ నిర్వహణ, కంట్రోల్ రూమ్‌ల ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో ఆయన కాకినాడ కలెక్టరేట్లో మంగళవారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల ఒకటో తేదీ నుంచి 12వరకు జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయన్నారు. వచ్చేనెల 3వతేదీ నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. బుధవారం నుంచి జిల్లా క్రీడామైదానంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మూడు షిఫ్ట్‌ల్లో సంబంధిత శాఖల సిబ్బందితో అందుబాటులో ఉంటుందన్నారు. కంట్రోల్ రూమ్‌కు సెట్రాజ్ సీఈవో ఉదయం 10గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పర్యవేక్షణాధికారిగా వ్యవహరిస్తారన్నారు. రాత్రి 10గంటలనుంచి తర్వాత రోజు ఉదయం 10 గంటల వరకు భూగర్భ జలశాఖ డీడీ పర్యవేక్షణాధికారిగా ఉంటారన్నారు. వీరికి సహాయకులుగా ఆయాశాఖల సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, సెట్రాజ్ సీఈవో మల్లికార్జునరావు, భూగర్భజలశాఖ డీడీ రాధాకృష్ణలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంచేందుకు కృషిచేయాలి: డీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రమేష్

కాకినాడ రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈవో పి.రమేష్ తెలిపారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల ఆనందభారతిలో మంగళవారం కాకినాడ నగరంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ నాస్ సర్వేలో వెనుకబడి ఉన్నామని, ప్రభుత్వ పాఠశాలలకు ఒక బ్రాండ్ ఉండాలని, విద్యార్థులకు నిరంతరం అసెస్మెంట్ జరపాలని సూచించారు. సమావేశంలో డీవైఈవో వెంకటేశ్వరరావు, ఎంఈవోలు రవి, సత్యనారాయణ, హెచ్‌ఎంలు సుబ్బలక్ష్మి, రాజు, శ్రీనివాసరావు, సత్యనారాయణరాజు, పుష్పగిరి, ప్రసాద్ పాల్గొన్నారు.


అద్భుత ప్రయోగాల గని అంతరిక్షం

» విద్యార్థులు అంతరిక్ష పరిశోధకులుగా ఎదగాలి
» కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో సైన్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి
» అంతరిక్ష అవగాహన శిబిరంలో ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో సమస్త ప్రపంచాన్ని శాసించే శక్తి కేంద్రాలకు అంతరిక్షమే నిలయం కానుంది. ప్రపంచ మానవాళి అంతరిక్షం కేంద్రంగానే నేడు ఎన్నో సేవలను పొందుతోంది. ఇంట్లో కూర్చుని టీవీ చూడగలుగుతున్నా, సెల్‌ఫోన్ వినియోగిస్తున్నా, శాటిలైట్ సినిమాలు చూడాలన్నా, వినాశకర యుద్ధ పరికరాలకు సిగ్నల్స్ అందాలన్నా అంతరిక్షమే కేంద్రంగా ఉంది. అటువంటి అంతరిక్షంలో ఎన్నో వింతలు, విశేషాలు ఉన్నాయి. చంద్రుడు, అంగారకుడు వంటి ఎన్నో గ్రహాలు ఉన్నాయి. ఆయా గ్రహాల్లో నీరు ఉందా. జీవ రాశులు ఉన్నాయా,మానవ మనుగడకు అవకాశం ఉందా. విలువైన ఖనిజ సంపదలు ఉన్నాయా ఇలా ఎన్నింటినో తెలుసుకునేందుకు నిరంతరం పరిశోధనలు కొనసాగుతూనే ఉన్నాయి. అటువంటి పరిశోధనల్లో భాగంగా భవిష్యత్తులో విద్యార్థులను అంతరిక్ష పరిశోధకులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రవ్యాప్తంగా తొలిసారిగా అంతరిక్ష అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతరిక్ష అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభ రీతిలో అర్థమయ్యేలా ప్రాక్టికల్స్ కోసం అమలాపురంలో సైన్స్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అమరావతి ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా, ముస్కాన్ సంస్థల సహకారంతో నిర్వహించిన అంతరిక్ష అవగాహన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి టెలిస్కోప్‌ను పరిశీలించారు. ఏఆర్‌వీఆర్ పరికరంతో అంతరిక్షంలోని వింతలను వీక్షించారు. డ్రోన్ల వినియోగాన్ని ప్రాక్టికల్‌గా విద్యార్థులకు దగ్గరుండి చూపించారు. రోబోటిక్స్ వర్చువల్ రియాలిటీ అనే అంశాలను స్పేస్ ఎడ్యుకేటర్లు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భమిడిపాటి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ సైన్స్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం రూ.20లక్షల అంచనా వ్యయంతో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ప్రయోగపూర్వకంగా సైన్స్‌ను వివరిస్తే విద్యార్థులు ఎప్పటికీ మరిచిపోరన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను అంతరిక్ష పరిశోధకులుగానే కాకుండా భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే సైన్స్ సెంటర్ల లక్ష్యమన్నారు. విద్యార్థులు ఇంజనీరింగ్‌లో సాఫ్ట్‌వేర్ రంగం ఒకటే ఉందనుకుంటే పొరపాటు. ఇస్రో, నాసావంటి అంతరిక్ష పరిశోధనా సంస్థల్లో అద్భుత అవకాశాలు ఉన్నాయి. ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు.

ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ 300 ఏళ్ల చరిత్ర గల అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలను పెంచుకోవాలని సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.మమ్మీ కోరారు. ప్రతి శాస్త్రోత్సవ ప్రదర్శనలో సీవీ రామన్ త్రీడీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కంభంపాటి హరిసూర్యనారాయణ రూ.20వేలు విరాళాన్ని ఎమ్మెల్యే ఆనందరావుకు అందించగా ఆయన జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యానికి అందజేశారు. సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు, ముస్కాన్ సీఈవో ప్రాణేష్ దేవ్‌నాథ్, జిల్లా ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బీర హనుమంతరావు, సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ (సీఎంవో) బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, సీహెచ్ ఘన సత్యనారాయణ, సైన్స్ ఫోరం అధ్యక్షుడు బెహరా సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, కౌన్సిలర్ సంసాని బులినాని తదితరులు పాల్గొన్నారు.





గాగుల్స్‌తో అంతరిక్షాన్ని చూస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు







విద్యార్థుల సమక్షంలో డ్రోన్లతో పాటు ఇతర ప్రదర్శనలు



పాఠశాల స్థాయి నుంచి ప్రోత్సహించడమే లక్ష్యం



కేశినేని వెంకటేశ్వర్లు, సీఈవో, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అమరావతి

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా పది కేంద్రాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తాం. బుడమేరు వరదల సమయంలో డ్రోన్స్ ఉపయోగించి పేదలను ఆదుకున్న విధానాలను వివరించడంతో పాటు చంద్రయాన్-2 ప్రయోగాలపై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. మాజీ రాష్ట్రపతి, అంతరిక్ష పరిశోధకుడు అబ్దుల్ కలాం స్ఫూర్తితో భవిష్యత్తు శాస్త్రవేత్తలను తీర్చిదిద్దేందుకు సైన్స్ సిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

గాగుల్స్‌తో అంతరిక్షంలోకి వెళ్లా



ముంగండ లోహిత, 9వ తరగతి, గూడాల

అంతరిక్ష అవగాహన శిబిరంలో భాగంగా గాగుల్స్ ధరించా. అవి పెట్టుకోగానే అంతరిక్షంలోకి వెళ్లడమే కాదు పక్క నుంచి రాకెట్లు వెళ్తున్నట్టు కనిపించింది. అంతరిక్షంలో ఎన్నో వింతలు చూడగలిగా. ఏఆర్‌వీఆర్ పరికరం ధరించగానే అంతరిక్ష అద్భుతాలు దర్శనమిచ్చాయి. అంతరిక్షంలో అన్ని వింతలు ఉన్నాయా అనిపించింది.

రాకెట్ తయారీలో పాల్గొనాలని ఉంది



ఓదూరి గోవర్ధన్‌వెంకటదుర్గ 10వ తరగతి, అమలాపురం

రాకెట్ తయారీ నమూనాను చూపించారు. తీసుకువచ్చిన రాకెట్ నమూనాను పూర్తిగా విడదీసి లోపల ఏమేమి ఉంటాయో చూపించారు. తిరిగి విద్యార్థులతోనే రాకెట్‌ను తయారు చేయించిన తీరు అద్భుతం. భవిష్యత్తులో రాకెట్ తయారీలో పాల్గొనాలని ఉంది. గ్రహాలపైకి వెళ్లే రోవర్స్ ఫొటోలు తీసే విధానాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు.

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెరిగింది



ఎస్.మాధురి, స్కూలు అసిస్టెంట్, ఫిజికల్ సైన్స్, మూలపొలం

అంతరిక్ష అవగాహన శిబిరంతో విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెరిగింది. ఇప్పటివరకు పుస్తకాల్లోను, టీవీల్లోను మాత్రమే రాకెట్ ప్రయోగాలను చూశారు. రాకెట్లను నేరుగా అంతరిక్షంలోకి ప్రయోగించే విధానాలను వివరించిన తీరు అద్భుతం. పాఠ్యాంశాలను ప్రాక్టికల్‌గా చూపించడం ద్వారా విద్యార్థులు స్పేస్ సైన్స్‌పై ఆసక్తి పెంచుకుంటున్నారు.

అలలు ఎగసి... రోడ్డును ఛిద్రం చేసి...



బీచ్ రోడ్డును తాకుతున్న అలలు

» కొత్తపట్నం వద్ద ధ్వంసమైన రహదారి
» గోతుల్లో పడి గాయాలపాలవుతున్న వాహనచోదకులు

కొత్తపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉవ్వెత్తున ఎగసిపడుతున్న రాకాసి అలల ధాటికి కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో బీచ్ రోడ్డు ధ్వంసమవుతోంది. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో పాటు సముద్రంలో ఏర్పడే పోటు, పాట్లతో అలలు తాటి చెట్టు ఎత్తున ఎగసిపడుతున్నాయి. దీంతో ఉప్పాడ-కాకినాడ మార్గంలో కొత్తపట్నం వద్ద బీచ్ రోడ్డు ఛిద్రమైంది. రాత్రిపూట మోటారు సైకిళ్లపై వెళ్లేవారు ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురులో అగాథాల్లాంటి గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. తక్షణం మరమ్మతులు చేయాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.





ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డులో కొత్తపట్నం వద్ద ఛిద్రమైన రోడ్డు

స్మార్ట్ సిటీకి రూ.485 కోట్లు వినియోగం

» కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోకహన్ సాహూ
» రాజ్యసభలో పలు కీలక అంశాలను ప్రస్తావించిన ఎంపీ సతీష్‌బాబు

కాకినాడ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాజ్యసభల ప్రశ్నోత్తరాల సమయంలో మంగళవారం టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పలు కీలక అంశాలు ప్రస్తావించారు. స్మార్ట్ సిటీస్ మిషన్ అమలు వివరాలపై, జాతీయ ఖనిజ అన్వేషణ నిధి కింద రాష్ట్రంలో జరుగుతున్న ప్రాజెక్టులపై ఎంపీ సతీష్‌బాబు కేంద్రాన్ని ప్రశ్నించారు. ఈ అంశాలపై కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి టోకహన్ సాహూ సమాధానం ఇచ్చారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద దేశవ్యాప్తంగా 100 నగరాలు ఎంపిక చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం నగరాలు ఈ మిషన్ కింద ఉన్నాయన్నారు. మొత్తం రూ.48 వేల కోట్లు కేంద్ర నిధుల మంజూరు చేయగా, ఇప్పటి వరకు రూ.47,459 కోట్లు నిధులు 99శాతం నగరాలకు విడుదలయ్యాయన్నారు. కాకినాడ స్మార్ట్ సిటీకి కేంద్రం రూ.490 కోట్లు మంజూరు చేయగా, రూ.485 కోట్లు ఖర్చు చేశారన్నారు. 2025 జూలై 11వ తేదీ నాటికి రాష్ట్రంలో స్మార్ట్ మిషన్ కింద మొత్తం 280 ప్రాజెక్టులు చేపట్టారని సహాయ మంత్రి సాహూ తెలిపారు. అలాగే జాతీయ ఖనిజ అన్వేషణ నిధిపై అడిగిన ప్రశ్నకు కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సమాధానమిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నాలుగు ఎన్ఎంఈటీ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయన్నారు. వీటి కోసం రూ.11 కోట్లు మంజూరయ్యాయని, ప్రధానంగా నికెల్, రెయిన్‌ఎర్త్ ఎలిమెంట్స్ వంటి ఖనిజాల అన్వేషణకు ఈ ప్రాజెక్టులు దోహదపడుతున్నాయన్నారు. అలాగే పోర్టులు, షిప్పింగ్, వాటర్వేస్‌లపై అడిగిన ప్రశ్నకు కేంద్ర పోర్టులు, షిప్పింగ్, వాట ర్వేస్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ సమాధానం ఇవ్వగా, ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకంపై అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీహర్ష్ మల్హోత్రా సమాధానమిచ్చారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన మక్కల్ నీది మయ్యం(ఎంఎన్ఎం) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలహాసన్‌ను పార్లమెంట్ భవన్‌లో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



రాజ్యసభకు ఎన్నికైన కమలహాసన్‌ను పార్లమెంట్ భవన్‌లో కలిసిన సతీష్‌బాబు

పట్టులో దిగుబడి, నాణ్యత కీలకం

మైసూరు సెంట్రల్ సిల్క్‌బోర్డు డైరెక్టర్ డాక్టర్ గాంధీదాస్



చేబ్రోలులో పట్టుగూళ్లను పరిశీలిస్తున్న డాక్టర్ గాంధీదాస్

గొల్లప్రోలు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టులో దిగుబడితో పాటు నాణ్యత కీలకమని, ఈ దిశగా రైతులకు పూర్తి సహకారం అందజేస్తామని మైసూరు సెంట్రల్ సిల్క్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ ఎస్.గాంధీదాస్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పట్టు పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఫంక్షన్ హాలులో మేరా రేషమ్-మేరా అభిమాన్(నా పట్టు-నా అభిమానం) కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సిల్క్ సమగ్ర-3 కార్యక్రమంలో భాగంగా పట్టు రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. అసంపూర్ణంగా ఉన్న మార్కెట్ షెడ్డును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టుపరిశ్రమ శాఖ రాష్ట్ర అదనపు సంచాలకురాలు అరుణకుమారి మాట్లాడుతూ పట్టు రైతులకు ఇన్సెంటివ్ బకాయిల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా విడుదల చేస్తామన్నారు. యాంత్రీకరణ సహా అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సదస్సులో పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్వీవీ సత్యనారాయణ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల పట్టు పరిశ్రమ శాఖ అధికారులు పాల్‌రాజు, కోనేటి అప్పారావు, సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్తలు డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ మురళి, బి.వజ్రమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

● ఎటపాక జవహర్ నవోదయలో రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు
● తొలిరోజు పాల్గొన్న 8 క్లస్టర్ల విద్యార్థులు



ఎటపాకలో టేబుల్ టెన్నిస్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఎటపాక, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు మంగళవారం నుంచి ఉల్లాసంగా ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతోపాటు అండమాన్ నికోబార్, లక్షద్వీప్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కృష్ణా, కడప, ఖమ్మం, షిమోగా, తుంకూర్, పతనంతిట్ట, వయనాడ్, బీదర్ క్లస్టర్ల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. తొలిరోజు నిర్వహించిన పోటీల్లో 40 మంది విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబర్చారు. అంతకుముందు టెబుల్ టెన్నీస్ పోటీలు ప్రారంభ సమయంలో మార్చ్ ఫాస్ట్‌తో గౌరవ వందనం సమర్పించారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు జరుగనున్నాయి. తొలుత ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ మాట్లాడారు. క్రీడలతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశానికి మంచిపేరు తేవాలి

పెద్దాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా దేశానికి మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురావచ్చని ప్రముఖ పారిశ్రామికవేత్త, లలిత ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాస్ అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని పీఎంశ్రీ నవోదయ విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రాంతీయ కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని, విద్యతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. తమ లక్ష్యాలను విద్యార్థి దశలోనే నిర్దేశించుకోవాలన్నారు. నవోదయ విద్యాలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ.సీతలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీనివాస్

ఆహ్లాదంగా నన్నయ యూనివర్శిటీ: వీసీ



ఉడ్‌చిప్పర్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, జూలై 29(ఆంధ్రజ్యోతి): నన్నయ విశ్వవిద్యాలయానిన అహ్లాదకర ప్రాంగణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్శిటీ సుందరీకరణలో భాగంగా చెట్ల కొమ్మలు, పొదలు వ్యర్థాలను చిప్స్‌గా మార్చే షైజోవీమా ఉడ్‌చిప్పర్ యంత్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ప్రాంగణంలోని చెట్లు, మొక్కల వ్యర్థాలను చిప్స్‌గా మార్చేందుకు ఈ యంత్రం ఉపయోగపడుతుందని, ఈ చిప్స్‌ను కంపోస్టు ఎరువుగా లేదా ఇతర అవసరాలకు ఉపయోగిస్తామన్నారు. ప్రకృతి నుంచి వచ్చిన దానిని తిరిగి ప్రకృతికి అందించి పర్యావరణ సమతుల్యత పాటించవచ్చునని వీసీ అన్నారు. కార్యక్రమంలో డీన్ ఇన్‌ఛార్జి అధికారి బి.జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి తగ్గుముఖం

6,01,844 క్యూసెక్కులు సముద్రంలోకి..

ధవళేశ్వరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల నుంచి పెరుగుతూ తగ్గుతూ ప్రవహించిన గోదావరి ఎగువ ప్రాంతాల్లో తగ్గుముఖం పడుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద మంగళవారం సాయంత్రానికి 6,01,844 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదయ్యింది. ఎగువన భద్రాచలం వద్ద 36.60 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 34.80 అడుగులకు తగ్గింది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు 4300, మధ్య డెల్టాకు 2600, పశ్చిమ డెల్టాకు 6000 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా కామాచార్యులు

కాకినాడ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన రామోజు నాగ వెంకటసత్య కామాచార్యులును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం న్యాయ శాఖ జీవోఆర్‌టీ నెం.264 జారీ చేసింది. ఈ అథారిటీలకు సంబంధించిన కేసులను హైకోర్టులో ఈయన వాదిస్తారు. మూడు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.

ఎస్‌సీఈఆర్‌టీ శిక్షణకు సంధ్యారాణి ఎంపిక



సంధ్యారాణికి ప్రొసీడింగ్స్ అందిస్తున్న డీఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీపురం సుంకర భాస్కరరావు మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో స్కూలు అసిస్టెంటుగా పనిచేస్తున్న కందనాల సంధ్యారాణి బెంగుళూరులోని రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్‌లో నిర్వహించే (స్టేట్ కౌన్సిల్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) 30 రోజుల కార్యక్రమానికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి తూర్పుగోదావరి జిల్లాలోని మునిసిపల్ హైస్కూలు నుంచి సంధ్యారాణి ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి అవసరమైన ప్రొసీడింగ్స్ సంధ్యారాణికి అందజేశారు. ఈ అవకాశం రావడానికి సహకరించిన స్కూలు హెడ్మాస్టర్ సన్యాసిరావుకు సంధ్యారాణి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ పురందేశ్వరితో ఒడిసా గవర్నర్ భేటీ



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో ఉన్న రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరితో ఒడిసా గవర్నర్ కంభంపాటి హరిబాబు భేటీ అయ్యారు. మంగళవారం పురందేశ్వరి నివాసానికి హరిబాబు విచ్చేశారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రానికి సంబంధించిన పలు విషయాలను వారిరువురు కొద్దిసేపు చర్చించుకున్నారని ఎంపీ కార్యాలయం వర్గాలు తెలిపాయి.

గ్రీన్‌ట్యాక్స్ రద్దుపై హర్షం

● లారీ రవాణా రంగాన్ని ఆదుకోవాలి
● ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబ్జీ

కాకినాడ రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ట్యాక్స్ రద్దుతో ప్రభుత్వం రవాణా రంగానికి ఎంతో మేలు చేసిందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గన నాగరాజు, జనసేన నాయకుడు హర్షం వ్యక్తం చేశారు. గ్రీన్‌ట్యాక్స్ రద్దు సందర్భంగా ఆయన కాకినాడ రూరల్ మండలం తూరంగి బొడ్డు చెరువు వద్దనున్న తన కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాబ్జీ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సమావేశంలో 26 యూనియన్ల సభ్యులు పాల్గొన్నారని, మూడు జిల్లాల్లోని కలెక్టర్లకు లారీ ఓనర్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా వివరించామన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలతో తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన లారీ రవాణా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు ఏటా టోల్‌ప్లాజా చార్జీలు పెరగడం వల్ల రవాణా రంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. రవాణారంగంపై వివిధ రకాల పన్నులు, రుసుల పెంచారని, రవాణా కోసం వస్తువులను, లోడ్, అన్‌లోడ్ జరిగేటప్పుడు, లారీ యజమానికి కిరాయి రాకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. లారీ యజమానుల సమస్యలపై కలెక్టర్‌కు త్వరలోనే వినతిపత్రం అందజేస్తామన్నారు.సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వామినాయుడు, సూర్యనారాయణరాజు, అర్జుబాబు, దుర్గాప్రసాద్, నానాజీ,వీరవెంకటరత్నం పాల్గొన్నారు.

ఏం కావాలో తెలుసుకోండి!

- నేటి నుంచి కుటుంబ అవసరాల సర్వే ప్రారంభం
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో

పీ4 బంగారు కుటుంబాల దత్తత లక్ష్యం 2లక్షల19వేలు

- ఆగస్టు 15 కల్లా ప్రక్రియ పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు



కలెక్టరేట్ (కాకినాడ), జూలై 29 (ఆంధ్రజ్యోతి): పేదలకు మంచిరోజులొస్తున్నాయి. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పీ4 బంగారు కుటుంబాల దత్తత స్వీకరణ కార్యక్రమం వేగవంతం చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అసలు పీ4 పరిధిలో ఉన్న బంగారు కుటుంబాల అవసరాలు ఏంటో తెలుసుకోవడానికి కుటుంబ అవసరాల(నీడ్ అసెస్మెంట్) సర్వే చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. బుధవారం నుంచి ఆ సర్వే ప్రారంభం కానుంది. ఆగస్టు 15వతేదీ కల్లా పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.

జిల్లాలవారీగా లెక్కలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2లక్షల 19వేల బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు మార్గదర్శులను గుర్తించాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. దీంతో ఇప్పటి వరకు 62వేల బంగారు కుటుంబాలను మార్గదర్శులను గుర్తించారు. దీనిలో పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్ జీవోలు ఉన్నారు. దీనిలో కాకినాడ జిల్లాలో లక్షా2వేల బంగారు కుటుంబాల దత్తత లక్ష్యం కాగా ఇప్పటి వరకు 35వేల కుటుంబాలను దత్తత స్వీకరించారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 60వేల బంగారు కుటుంబాల దత్తత లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటివరకు 15వేల కుటుంబాలను దత్తత స్వీకరణ జరిగింది. తూర్పుగోదావరి జిల్లా విషయానికి వస్తే 57వేల బంగారు కుటుంబాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 12వేల బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి కొంతమంది మార్గదర్శులు ముందుకొస్తున్నప్పటికీ వారి అవసరాలు ఏంటో ముందే తెలుసుకోవాలని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో కుటుంబ అవసరాల(నీడ్ అసెస్మెంట్) సర్వే చేయడానికి సర్వం సిద్ధం చేసింది. దీని కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ రూపకల్పన చేసింది. ఈ యాప్‌ను ఇప్పటికే కాకినాడ జిల్లా, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉద్యోగులు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాల్లో బుధవారం నుంచి సర్వే ప్రారంభంకానుంది. తూర్పుగోదావరి జిల్లాలో గురువారం నుంచి గానీ, శుక్రవారం నుంచి గానీ ఈ సర్వే చేయనున్నారు. ఈ జిల్లాలో యాప్ డౌన్‌లోడ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

వారిపై ప్రత్యేక దృష్టి...

బంగారు కుటుంబాల్లో వితంతువులు, ఒంటరి మహిళలపై ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరిస్తారు. వీరికి ఇతర కుటుంబసభ్యుల మద్దతు ఉందా లేదా అనే విషయాలను విచారణ చేస్తారు. ఒంటరి మహిళల అవసరాలను తెలుసుకుని యాప్‌లో నమోదు చేస్తారు. పింఛన్, ఇతర ఆర్థిక సాయాలు ఏం అందుతున్నాయి వంటి వివరాలు సర్వే ద్వారా తెలుసుకుని నమోదు చేస్తారు.

సచివాలయ ఉద్యోగుల ద్వారా సర్వే

కుటుంబ అవసరాల సర్వే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల ఆధ్వర్యంలో సర్వే జరుగుతుంది. ప్రభుత్వం వీరికి ఇచ్చిన ప్రత్యేక యాప్ ద్వారా ఆయా బంగారు కుటుంబాల వద్దకు వెళ్తారు. ఆయా కుటుంబాల అవసరాలను తెలుసుకుని దానిలో నమోదు చేస్తారు. ఉదాహరణకు ఒక కుటుంబంలో నలుగురు సభ్యులు ఉంటే వారిలో ఎంతమందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయి... వారు ఎలాంటి విద్యార్హత కల్గి ఉన్నారు.. ఎలాంటి ఉపాధి కల్పిస్తే ఆర్థికంగా నిలబడతారు.. వంటి అంశాలు పరిశీలిస్తారు. ఆయా బంగారు కుటుంబాలు ప్రధానంగా ఎలాంటి సమస్యవల్ల సతమత మవుతున్నా రు వంటి అంశాలను విచారణ చేసి నమోదు చేస్తారు.

కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ప్రారంభించిన బంగారు కుటుంబాల దత్తతకు జిల్లాలో కార్పొరేట్ సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులు, పరిశ్రమల యాజమాన్యం, గ్యాస్ ఏజెన్సీలు, హేచరీలు, పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ముందుకు రావాలి. ఎన్‌జీవోలు, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించాలి. దీని వల్ల పేదలను ఆర్థికంగా, సామాజికంగా పైకి తేవాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. బంగారు కుటుంబాల మార్గదర్శకులు దత్తత స్వీకరణ కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది.

– కాకినాడ జిల్లా కలెక్టర్, షాన్‌మోహన్

ఏలేరుకు గోదావరి జలాలు



ఏలేరులోకి చేరిన గోదావరి జలాలు

ఏలేశ్వరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టుకు మంగవారం గోదావరి జలాలు ప్రవేశించాయి. ప్రాజెక్టులోకి 175 క్యూసెక్కుల నీరు చేరుతోంది. జగ్గంపేట మండలం రామవరం వద్ద స్టేజ్2 నుంచి పంపుల ద్వారా నీటిని ఏలేరుకు తరలిస్తున్నారు. గోదావరి జలాలు ఏలేరుకు చేరడంతో ప్రాజెక్టుపై ఆధారపడిన సుమారు 56వేల ఎకరాలకు సాగు సరఫరా చేసేందుకు వీలుంటుంది. ఇన్నాళ్లు ప్రాజెక్టులో కేవలం 10.46 టీఎంసీల నీరు మాత్రమే ఉండేది. ఈ నీటినే పంపుల ద్వారా విశాఖకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు సాగుపై ఆందోళన ఏర్పడింది. ఇప్పుడు గోదావరి నీరు వస్తుండడంతో రైతుల ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ప్రాజెక్టు స్థితిగతులు

ప్రస్తుతం ప్రాజెక్టులో 86.56 మీటర్ల ఎత్తున 24.11 టీఎంసీలను నిల్వచేయవచ్చు. వర్షాలు కురవకపోవడంతో నీరు చేరలేదు. దీని వల్ల వారంక్రితం వరకు ప్రాజెక్టులో కేవలం 10.31 టీఎంసీల నీరు మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఏలేరులో 77.25 మీటర్ల స్థాయిలో 10.46 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. ఖరీఫ్ సాగుకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా నీరు విడుదల చేస్తామని ఏలేరు అధికారులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం సాగుకు 1300 క్యూసెక్కుల వంతున, ఏ డమ కాలువ నుంచి విశాఖకు 200 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని చెప్పారు.

మద్యం షాపుపై పోలీసుల దాడి

పలువురికి గాయాలు



గాయపడి చికిత్స పొందుతున్న రాజీవ్

కరప, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో ఒక మద్యం దుకాణాన్ని పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేసి మద్యం సేవిస్తున్న వారిపై దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిత్ర గార్డెన్ ఎదురుగా ఉన్న తిరుమల వైన్స్ వద్దకు సోమవారం రాత్రి 9 గంటల సమయంలో పోలీసులు వచ్చి బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపై దాడి చేశారు. రాజీవ్ అనే వ్యక్తి చేతులకు రక్తపు గాయాలు కాగా మిగిలిన వారు తలో దిక్కుకు పరుగులు తీశారు. మద్యం దుకాణం సిబ్బంది బాధితుడికి చికిత్స చేయించారు. దురుసుగా ప్రవర్తించిన పోలీసుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై కరప ఎస్ఐ సునీతను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పోలీసులు దాడి చేయడం అవాస్తవం అన్నారు. ప్రధాన రహదారిని చేర్చి ఉన్న 2 మద్యం దుకాణాలపై ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో వాటిని నిరోధించే ప్రయత్నంలో పోలీసులు అక్కడి వెళ్లారని తెలిపారు. పోలీసులను చూసి పారిపోతుండగా ఒక వ్యక్తికి చేతులకు రేకులు గుచ్చుకుని రక్తపు గాయాలయ్యాయన్నారు. నూసెన్స్ కలిగిస్తున్న 2మద్యం దుకాణాలపై బైండోవర్ కేసులునమోదు చేస్తామన్నారు.

పదో తరగతి విద్యార్థినికి గర్భం..

పాఠశాల కరస్పాండెంట్‌పై పోక్సో కేసు

పరారీలో నిందితుడు

కోనసీమ జిల్లా డీఈవో విచారణ



స్కూల్‌ను తనిఖీ చేసిన డీఈవో సలీం బాషా

రాయవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిని లోబర్చుకుని గర్భవతిని చేసిన కరస్పాండెంట్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని ఓ గ్రామంలోని ప్రైవేటు ఫౌండేషన్ స్కూల్ కరస్పాండెంట్ ఎ.షాజీ జయరాజ్ ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. 10వతరగతి బాలికపై కన్నేసి కొన్ని నెలల క్రితం బెదిరించి గర్భవతిని చేశాడు. బాలిక తల్లిదండ్రులు ఈనెల 28న రాయవరం పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పర్యవేక్షణలో జయరాజ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్టు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. ఆ ఫౌండేషన్ స్కూల్‌ను మంగళవారం కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా తనిఖీ చేశారు. 8,9,10 తరగతులు అనుమతులు లేకుండా ఏ విధంగా నిర్వహిస్తున్నారు అనే విషయాన్ని డీఈవో ఆరా తీశారు. పాఠశాల యాజమాన్యంపై సమగ్రమైన దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాలిక కుటుంబ సభ్యులను కలిసి సంఘటనపై ఆరా తీశారు. డీఈవోతో పాటు ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, సీఐ దొరరాజు, ఎస్ఐ సురేష్ బాబు, ఐసీడీఎస్ అధికారులు బాలిక కుటుంబ సభ్యులను కలిసి విచారణ జరిపారు. కాగా కరస్పాండెంట్ జయరాజ్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసులు వెతుకుతున్నారు.

దళితుడిపై దాడి కేసులో మరో నిందితుడి అరెస్ట్

అమలాపురం టౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): దళితుడు దోనిపాటి మహేశ్వరరావుపై దాడి చేసిన కేసులో మరో నిందితుడిని అరెస్టు చేసినట్టు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కీలక ఆధారాలను సేకరించి ఇప్పటికే ఐదుగురు నిందితులను అరెస్టు చేశామన్నారు. మంగళవారం కోనసీమ జిల్లా ఈదరపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి దుర్గామహేష్ అలియాస్ మహేష్‌ను అతడి ఇంటి వద్ద అరెస్టు చేసి అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచామన్నారు. నిందితుడికి కోర్టు 14రోజులు రిమాండు విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయిన యల్లమిల్లి విజయ్ రవిశంకర్, ఉరదల బాలరాజు, యర్రా కృష్ణ, మల్లాడి సుదర్శన్, తోట నాగవెంకటసత్యనారాయణ రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని డీఎస్పీ ప్రసాద్ తెలిపారు.

దారి దోపిడీ ఘటనపై దర్యాప్తు ముమ్మరం

విచారణకు 5 ప్రత్యేక బృందాలు

సీసీ కెమెరాల పరిశీలన



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్

గొల్లప్రోలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారు చెందుర్తి రోడ్డులో జరిగిన దారి దోపిడీ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దోపిడీకి పాల్పడిన ఆగంతకులను గుర్తించి పట్టుకునేందుకు 5 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ చేపట్టారు. రాజమహేంద్రవరం నల్లమందు సందులోని భవానీ సిల్వర్ ప్యాలెస్‌లో గుమస్తాగా పనిచేస్తున్న సమీర్ ప్రజాప్రత్ పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలుల్లో వెండి, బంగారు వస్తువులు డెలివరీ ఇచ్చి వారు ఇచ్చిన ముడి వెండి, నగదును తీసుకుని ఎన్‌హెచ్ 216 నుంచి చెందుర్తి వెళ్లే రోడ్డులోకి వెళ్లగా పామాయిల్ తోటల వద్ద సోమవారం రాత్రి 2 మోటార్‌సైకిళ్లపై నలుగురు ఆగంతకుల వచ్చి అతడిపై దౌర్జన్యం చేసి బెదిరించి ఆభరణాలు, నగదు ఉన్న బ్యాగులను లాక్కుని పరారయ్యారు. ఇందులో 12.5కిలోల వెండి వస్తువులు, ముడి వెండి, 51 గ్రాముల బంగారం వస్తువులు, 60వేలు నగదు ఉన్నట్టు ప్రజాప్రత్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పిఠాపురం సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. కేసులో విచారణకు పిఠాపురం సీఐ, సర్కిల్‌లోని నలుగురు ఎస్ఐల నేతృత్వంలో 5 విచారణ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్, కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో వారు విచారణ చేపట్టారు. పిఠాపురం నుంచి గొల్లప్రోలు వరకూ, 216వ జాతీయరహదారి వెంబడి ఉన్న గోడౌన్లు, రైసుమిల్లులు, ఇతర భవనాల సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. సంఘటన జరిగిన సమయంలో వెళ్లిన ద్విచక్ర వాహనాలను గుర్తించే పనిలోపడ్డారు. ఇంత భారీ మొత్తంలో వెండి, బంగారు వస్తువులను ఎటువంటి రక్షణ లేకుండా ఎలా తీసుకువెళ్తున్నాడు అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. తెలిసిన వారు చేశారా, లేకా సమీర్ ప్రజాప్రత్ రాకపోకలను గుర్తించి రాజమహేంద్రవరం లేదా పెద్దాపురం, పిఠాపురం నుంచి వెంబడించి ఆగంతకులు ఈ పని చేశారా అనే విషయాన్ని వారు పరిశీలిస్తున్నారు. ఫిర్యాదులోని అంశాలపైనే బాధితుడిని వివిధ కోణాల్లో ప్రశ్నించి వివరాలు రాబట్టారు.

'జయలక్ష్మి సొసైటీ బాధితులను భయాందోళనకు గురిచేయవద్దు'



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు, డైరెక్టర్లు

సర్పవరం జంక్షన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జయలక్ష్మి సొసైటీ పాలకవర్గంపై నిరాధార ఆరోపణలు చేసి బాధితులను భయాందోళనకు గురి చేయవద్దని ఆ సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు కోరారు. మంగళవారం కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో గల ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ సంస్థ ప్రధాన కార్యాలయంలో సొసైటీ డైరెక్టర్లు చింతా సుబ్బారావు, షేక్ జానీ బాషా, కె గౌరీశంకర్‌లతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.582 కోట్ల ఆర్థిక కుంభకోణం కేసులో సుమారు రూ.80 కోట్లకు మాత్రమే సెక్యూరిటీ ఉందని, మిగతా డిపాజిట్లకు ఎటువంటి ఆధారాలు లేని స్థితి నుంచి సుమారు రూ.500 కోట్లకు పైగా నిందితుల ఆస్తులను గుర్తించి, 13 జీవోలు జారీ కావడ్డాయని, సీఐడీతో ఈ ఆస్తులను జప్తు చేయించి కోర్టులో వేయించడం జరిగిందన్నారు. రూ.300 కోట్ల ఆస్తుల జప్తుపై ట్రిబ్యునల్‌కి వెళ్లగా, ఇందులో 13 కేసులకు సంబంధించి రూ.30 కోట్లపై కోర్టు వాయిదాలకు నిందితులు హాజరుకాకపోవడంతో ట్రిబ్యునల్ కోర్టు నుంచి డిక్రీ ప్రకటన జారీ అయిందన్నారు. దీని ఆధారంగా ఈపీ దాఖలు చేసి సదరు రూ. 30 కోట్లు స్థిరాస్తులను సొసైటీ పేరున దఖలకు అనుకూలంగా తీర్పు ఇవ్వాలని పిటిషన్ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు పాలకవర్గ డైరెక్టరు పూర్తి పారదర్శకంగా పని చేస్తున్నామన్నారు. బాధితులకు సత్వర న్యాయం కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేస్తే సత్వరంగా సెటిల్ అవుతాయన్నారు. బాధితుల తరఫున జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి లెటర్ రాయడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. సొసైటీపై ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టబద్ధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్ట్

1,142 కిలోల గంజాయి స్వాధీనం : రంపచోడవరం డీఎస్పీ సాయి ప్రశాంత్



పట్టుబడిన గంజాయి బస్తాలను చూపిస్తున్న డీఎస్పీ సాయి ప్రశాంత్

రంపచోడవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతం నుంచి తరలిస్తున్న 1,142 కిలోల గంజాయిని రంపచోడవరం పోలీసులు పట్టుకోగా ఈ కేసులో నలుగురిని మంగళవారం అరెస్ట్ చేశారు. డీఎస్పీ జి.సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఉత్తర్వులపై ఇతర జిల్లాలకు గంజాయి రవాణా చేస్తున్నట్టు సమాచారం రావడంతో జూన్ 27న మండలంలోని తాళ్లపాలెం వేళ్లే రోడ్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా బొలెరోలో రవాణా చేస్తున్న 1,142 కిలోల గంజాయిని స్వాధీన పర్చుకున్నారు. అప్పుడు నిందితులు పారిపోయినట్టు డీఎస్పీ తెలిపారు. నిందితులు వదిలి వెళ్లిన వాహనాల ఆధారంగా పాడేరు, చింతపల్లి, నర్సీపట్నం ప్రాంతాల్లో విచారణ చేసి అరెస్టు చేశామన్నారు. అరెస్ట్ అయినవారిలో అల్లూరి జిల్లా చింతపల్లి మండలం స్రుంటుపల్లికి చెందిన జెమ్మిలి రాజేష్, కొత్తవీధి మండలం పెట్రాయికి చెందిన కోడ శ్రీకాంత్, చింతపల్లి మండలం వీరవరం గ్రామానికి చెందిన వంతల కిరణ్, తెలంగాణ రాష్ట్ర వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం చంద్రతండాకు చెందిన భుక్యా దేవేందర్ ఉన్నట్టు పేర్కొన్నారు. బొలేరో, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ మార్కెట్‌లో రూ.కోటి 10 లక్షలు ఉంటుందన్నారు. దాడుల్లో సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ వెంకట్రావు పాల్గొన్నారు.

రైలులో పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అందజేత



తునిలో ప్రయాణికుడికి ల్యాప్‌టాప్‌ని అందజేస్తున్న రైల్వే పోలీసులు

తునిరూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నుంచి తుని వరకు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (డీ-3 కోచ్) లో ప్రయాణించిన ఓ వ్యక్తి తన ల్యాప్‌టాప్‌ను రైలులో మర్చిపోయి దిగిపోయాడు. కాకినాడ జిల్లా తుని జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జీఆర్‌పీ ఎస్ఐ శ్రీనివాసరావు అదే రైలులో విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లకు సమాచారం అందించారు. వారు వెంటనే స్పందించి బ్యాగ్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఎస్ఐ శ్రీనివాసరావు బ్యాగ్‌ను ప్రయాణికుడికి అందజేశారు.

అరటి, కొబ్బరి తోటల నరికివేతపై దీక్ష

ప్రత్తిపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఇ.గోకవరం గ్రామంలో అరటి, కొబ్బరి తోటలను దౌర్జన్యంగా నరికివేతపై బాధిత రైతు రిలే నిరాహార దీక్ష చేపట్టాడు. తన పొలంలో ఏర్పాటు చేసుకున్న శిబిరంలో రైతు రాజమండ్రికి చెందిన సత్తి వినోద్ రెడ్డి, పలువురు రైతులు దీక్షలు చేపట్టారు. వినోద్‌రెడ్డి మాట్లాడుతూ తమ భూమికి క్రయ దస్తావేదులు, రికార్డులు ఉన్నప్పటికీ ఏ సంబంధం లేని చింతాకుల భాస్కరరావు, ధర్మాజీ, మరికొందరు ఈనెల 23న పొలంలో సాగు చేపట్టిన అరటి, కొబ్బరి మొక్కలను దారుణంగా నరికివేశారని వాపోయాడు. దీనిపై ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారన్నారు. ఈ భూ వివాదం కారణంగా తనకు ప్రాణహాని కూడా ఉందని... పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని కాపాడాలని బాధితుడు కోరారు.



కాకినాడ జిల్లా ఇ.గోకవరంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న రైతు

దళితులకు అత్యంత ద్రోహం చేసిన జగన్ : హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): దళిత వ్యతిరేక కార్యక్రమాలు చేసిన జగన్ ఇప్పుడు దళితులపై దాడులు జరగకుండా దళిత ఫోర్స్ ఏర్పాటు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాలలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. దేశ చరిత్రలో దళితులకు అత్యంత ద్రోహం చేసిన వ్యక్తి మాజీ సీఎం జగన్ అని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో దళితులను కులవివక్షతతో అణిచివేశారన్నారు. దళితులకు ఉప యోగపడే 25 సంక్షేమ పథకాలను రద్దుచేశాడని చెప్పారు. దళితుల గురించి మాట్లాడే అర్హత, హక్కు జగన్‌కు లేదన్నారు.. మమ్మల్ని మేము రక్షించుకోవడం, మా హక్కుల కోసం పోరాటం చేయడం మాకు తెలుసునని నిన్ను నమ్మే పరిస్థితి దళిత సమాజంలో లేదని అన్నారు.

పారదర్శకంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్

దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దు

విశాఖపట్నం ఆర్మీ అధికారులు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 5నుంచి 20 వరకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు విశాఖపట్నం ఆర్మీ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఆర్మీలో ఉద్యోగాల కోసం దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని పేర్కొన్నారు. ప్రధానంగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులకు నియామకం జరుగుతుందన్నారు. 8 నుంచి 10 తరగతి పాస్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, అనకాపల్లి, ఏలూరు, ఎన్‌టీఆర్, కాకినాడ జిల్లా, యానాం నుంచి ర్యాలీకి అడ్మిట్ కార్డులు పొందిన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. గత మార్చి 12న ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ర్యాలీ నోటిఫికేషన్ ప్రకారం అన్ని ధ్రువపత్రాలు, ఫోన్‌లను తీసుకురావాలని.. దళారులు, ఏజెంట్లు, మధ్యవర్తుల్ని నమ్మవద్దని కోరారు.

అదృశ్యమైన ఇద్దరు బాలికలు..

సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత

సర్పవరం జంక్షన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఎస్.అచ్యుతాపురానికి చెందిన ఇద్దరు బాలికలు అదృశ్యం కాగా సాంకేతిక పరిజ్ఞానంతో వారిని సురక్షితంగా తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పజెప్పారు. కాకినాడ 48వ డివిజన్ పరిధి ఎస్.అచ్యుతాపురానికి చెందిన తంగెళ్ల సూర్యనాగమ్మ-నరసయ్య కుమార్తె రామారావుపేటలోని సంజీవ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. సోమవారం ఉదయం కళాశాలకు వెళ్లిన ఆమె సాయంత్రం ఇంటికి రాకుండా అదే ప్రాంతానికి చెందిన 10వ తరగతి చదువుతున్న మరో బాలికతో కలిసి మిస్సింగ్ అయినట్టు సదరు బాలిక తండ్రి ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో రాత్రి ఫిర్యాదు చేశాడు. ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్ పర్యవేక్షణలో రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో బాలికల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్, సీసీ కెమెరాల ఆధారంగా బాలికలు అమలాపురం వైపు వెళ్తున్నట్టు గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన అమలాపురం పోలీసులు బాలికలను మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకుని వారి సమాచారాన్ని ఇంద్రపాలెం పోలీసులకు అందించారు. దీంతో ఎస్ఐ ఎం.వీరబాబు సిబ్బందితో కలిసి అమలాపురం వెళ్లి బాలికలను పోలీస్‌స్టేషన్‌కి తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇచ్చిన అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. ఫిర్యాదుపై తక్షణం స్పందించి తమ కుమార్తెలను సురక్షితంగా అప్పగించేలా చర్యలు తీసుకున్న ఎస్పీ బిందుమాధవ్, ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు, సిబ్బందికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు బాలికలతో ఎస్ఐ వీరబాబు

ఆర్టీసీ డ్రైవర్‌కు మూడు బంగారు పతకాలు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా రవీంద్రపాడులో ఈ నెల 26, 27న జరిగిన రాష్ట్ర స్థాయి అమరావతి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాకినాడకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ మందపల్లి శ్రీనివాసరావు 3 బంగారు పతకాలు సాధించారు. నవంబరులో భూటాన్‌లో జరిగే అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు, జనవరిలో బెంగళూరులో జరిగే ఏషియన్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఆయన్ని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవివర్మ, కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు అభినందించారు.



శ్రీనివాసరావును అభినందిస్తున్న ఆర్టీసీ ఈడీ

కాకినాడ రూరల్-1 ఎంఈవోగా రంగారావు

సర్పవరం జంక్షన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎంఈవో-1గా తుమ్మల వెంకట సత్య రంగారావు నియమితులయ్యారు. జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేస్తున్న ఆయనకు ఎంఈవోగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఆరోగ్య ఉప కేంద్రం

భవనాన్ని తక్షణం అప్పగించాలి

ఎలక్ట్రికల్, పైప్‌లైను పనులు పూర్తి చేయాలి

పాడా పీడీ సత్యనారాయణ ఆదేశం



ఆరోగ్య ఉప కేంద్రం భవనాన్ని పరిశీలిస్తున్న పాడా ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ

పిఠాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం భోగాపురంలోని ఆరోగ్య ఉప కేంద్రం భవనానికి తక్షణం విద్యుత్ కనెక్షన్, తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుచేసి వైద్య, ఆరోగ్య శాఖకు అప్పగించాలని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్వీవీ సత్యనారాయణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. 'ఆరోగ్య ఉప కేంద్రం భవనం గొడౌన్‌గా మారింది' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు మంగళవారం పీడీ వచ్చి భవనాన్ని పరిశీలించారు. హెల్త్ సెంటర్‌ను మార్చాలని సూచించారు. కాగా తనకు భవన నిర్మాణానికి సంబంధించి రూ.7లక్షల బిల్లులు రావాల్సి ఉందని కాంట్రాక్టరు పీడీకి విన్నవించారు. దీనిపై లిఖితపూర్వకంగా దరఖాస్తు అందిస్తే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, వైద్య, ఆరోగ్య శాఖ, ఏపీఈపీడీసీఎల్ అధికారులు, సర్పంచ్ వరలక్ష్మి కార్యదర్శి రాజేంద్ర పాల్గొన్నారు.

ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి రేపు సీబీటీ పరీక్ష

కాకినాడ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ పరిధిలోని సీబీఎంఎస్ఎం ఎయిడెడ్ యూపీ స్కూల్, అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం గిన్నెపల్లిలోని ఈఎం ఎయిడెడ్ యూపీ స్కూలులో ఖాళీగా ఉన్న ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించిన కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)ను గురువారం నిర్వహించనున్నట్టు డీఈవో పి.రమేష్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు హాల్ టికెట్లను https://cse.ap.gov.in/AidedRecruitmentNotificationsలో డౌన్‌లోడ్ చేసుకోవాలని, నేరుగా దరఖాస్తు చేసుకున్న వారు కాకినాడ డీఈవో కార్యాలయంలో పొందవచ్చన్నారు. కాకినాడ అచ్యుతాపురం రైల్వేగేట్ సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్‌లో గ్రేడ్-2 హిందీ పండిట్ అభ్యర్థులకు ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, ఎస్జీటీ అభ్యర్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. రంపచోడవరం మండలం గిన్నెపల్లిలో స్కూల్లో గ్రేడ్-2 (హెచ్‌పీ, టీపీ, ఎస్‌ఏ(ఎం)) ఉద్యోగాలకు ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, ఎస్జీటీ ఉద్యోగాలకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు కాకినాడ అచ్యుతాపురం రైల్వేగేట్ సమీపంలోని అయాన్ డిజిటల్ పరీక్ష జరుగుతుంది. హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కలిగిన ధ్రువపత్రంతో ఒక గంట ముందుగా హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 87127 14799 నెంబర్లో సంప్రదించాలన్నారు.

ఉపాధి హామీ పథకంలో

94 రకాల పనులు

సామాజిక తనిఖీ డైరెక్టర్ శ్రీకాంత్



చిత్రాడలో ఉపాధి పనులపై అవగాహన కల్పిస్తున్న సామాజిక తనిఖీ డైరెక్టర్ శ్రీకాంత్

పిఠాపురం రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 94 రకాల పనులు నిర్వహిస్తున్నట్టు సామాజిక తనిఖీ డైరెక్టర్ జి.శ్రీకాంత్ తెలిపారు. ఉపాధి పథకంపై శ్రామికులు, రైతులు, వివిధ వర్గాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ పిఠాపురం మండలం చిత్రాడలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రతి కుటుంబం 100 రోజులు పని పూర్తి చేయడంతో పాటు గరిష్ఠ వేతనం ఎలా పొందాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. వేతనదారుల హక్కులు, రూ.307 వేతనం రావడానికి దోహదం చేసే అంశాలను వివరించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ కొత్తలూరి సునీత, బీసీ వెల్ఫేర్, డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, సోషల్ ఆడిట్ బృందం సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు వీరే...

ఎల్ఐసీ ఏవోఐ కాకినాడ మెయిన్ బ్రాంచ్ నూతన కార్యవర్గం

కాకినాడ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా రాజమహేంద్రవరం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన వైఎంసీఏ హాల్‌లో కాకినాడ ఎల్ఐసీ ఏవోఐ మెయిన్ బ్రాంచ్ (674) యూనియన్ అధ్యక్షుడు కోనాడ ప్రకాశరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన 3వ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర కమిటీ, డివిజన్ కమిటీ నాయకులు, సీఐటీయూ నాయకులు, ఎల్ఐసీ స్టాఫ్ యూనియన్ నాయకులు అతిథులుగా విచ్చేశారు. మెయిన్ బ్రాంచ్ యూనియన్ అధ్యక్షుడిగా కోనాడ ప్రకాశరావు, ఉపాధ్యక్షుడిగా ద్రోణం సిద్ధార్థకుమార్, కోశాధికారిగా చెక్కా వీరభద్రరావు, కార్యదర్శిగా చింతపల్లి అప్పారావు, సంయుక్త కార్యదర్శులుగా కింతాడ నాగరాజు, కంచు నూకరత్నం, కార్యనిర్వాహక కార్యదర్శిగా రెడ్డి శ్రీనివాసరావు, గౌరవ సలహాదారులుగా చల్లా సత్యదత్తు, దండు వీరభద్రరావు, వాడకట్టు నెహ్రూలా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టారు.



ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతున్న డీఈవో రమేష్

'విద్యార్థుల్లో అంతర్గత సామర్థ్యాన్ని వెలికితీయాలి'

గొల్లప్రోలు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అంతర్గతంగా ఉన్న ప్రతిభ, సామర్థ్యాలను వెలికితీయాలని డీఈవో పిల్లి రమేష్ సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఉపాధ్యాయులకు జరుగుతున్న స్కూల్ లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం రెండో విడత శిక్షణ తరగతులను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ నాయకత్వం అనేది పెత్తనం కాదని, బాధ్యత అని గుర్తించాలన్నారు. మన కుటుంబాల విషయంలో ఎంత ప్రణాళికాబద్ధంగా ఉంటామో అదే రీతిలో పాఠశాల నిర్వహణ, పరిపాలన విషయంలో ఉండాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు గురించి వివరించాలన్నారు. విద్యార్థుల్లో రైటింగ్ స్కిల్స్ డెవలప్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏఎంవో జగన్మోహన్, గొల్లప్రోలు ఎంఈవో-2 శివప్రసాద్, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

అనఘా దత్త క్షేత్రంలో సామూహిక పారాయణ

పిఠాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారంలో గల అనఘా దత్త క్షేత్రంలో మంగళవారం రాఘవేంద్రస్వామి సామూహిక పారాయణ జరిగింది. కేరళ, కర్నాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు పారాయణలో పాల్గొన్నారు. శ్రీపాదశ్రీవల్లభ అనఘా దత్తాత్రేయస్వామి ఆలయ ప్రాంగణంలో నాగ (గరుడ) పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాతుర్మాస్య వ్రత దీక్షలో ఉన్న మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద సరస్వతి స్వామీజీ జైమిని భారతం ప్రవచనం ద్వారా భక్తులకు అనుగ్రహభాషణ చేశారు.

పీ4లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు



సమావేశంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు అమలవుతున్నా కొన్ని కుటుంబాలు ఇంకా అట్టడుగు స్థాయిలోనే ఉండిపోతున్నాయని గ్రహించిన సీఎం చంద్రబాబునాయుడు పీ-4 (పబ్లిక్ ప్రైవేట్ ప్రజల పార్టనర్‌షిప్) ప్రవేశపెట్టారని సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. కాకినాడ స్మార్ట్‌సిటీ సమావేశ మందిరంలో మంగళవారం పీ-4తో ప్రతి ఇంటికీ అభివృద్ధి, ప్రతి జీవితానికీ ప్రగతి కార్యక్రమాన్ని అదనపు కమిషనరు కేటీ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, భవన నిర్మాణదారులు, వైద్య ప్రముఖులు, విద్యా సంస్థల ప్రతినిధులు, ఉద్యోగులతో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ నగరంలో కడు పేదరికంలో ఉన్న 15వేల మందిని అధికారులు గుర్తించారన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ దగ్గర ఫండింగ్ లేదు. మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆలోచించి చేయగలిగింది చేస్తామని అధ్యక్షుడు గ్రంధి బాబ్జీ పేర్కొన్నారు. అవకాశం ఉన్నంతమేర ఎప్పుడూ సాయం చేస్తామని, ఈ పథకం ద్వారా నెలకు లక్ష రూపాయలు వ్యయం చేస్తామని ఎస్‌సీఎస్ గ్రూపు చైర్మన్ నారాయణం మురళి అన్నారు. షిప్పింగ్ ఏజెన్సీస్ బాబు మాట్లాడుతూ తమ ప్రతినిధులతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ఈ పథకం కొనసాగాలన్నారు. ఒక కమిటీ ఏర్పాటు చేసి నిరంతరం కొనసాగించేందుకు కృషి చేయాలని, పీ4కు తన వంతు సహకారం అందిస్తానన్నారు. బాదం బాలకృష్ణ మాట్లాడుతూ నెలకు లక్ష రూపాయలు తగ్గకుండా సహాయం చేస్తానన్నారు. పలువురు వ్యాపారవేత్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి తాను చదివిస్తున్న విద్యార్థినికి రూ.20వేలు చెక్కును ఎమ్మెల్యే ద్వారా అందజేశారు. కౌంటర్లలో ఎవరు ఎంత మందిని దత్తత తీసుకుంటున్నారో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనరు కోన శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.





కాజులూరు మండలంలో వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న మంత్రి సుభాష్, సామర్లకోట మండలం గొంచాలలో ఎమ్మెల్యే చినరాజప్ప పర్యటన

'ఏడాదిలోనే రెట్టింపు సంక్షేమ పాలన'

కాజులూరు (కరప), జూలై 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెట్టింపు సంక్షేమ పాలన అందించారని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా మంగళవారం ఆయన కాజులూరు మండలం తిప్పరాజు పాలెం, అయితపూడి గ్రామాల్లో పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరించారు. కూటమి నాయకులు, టీడీపీ గ్రామ శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, డీసీలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ రథసారధి అని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా మంగళవారం రాత్రి ఆయన డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), కూటమి నాయకులతో కలిసి గొంచాలలో ఇంటింటా పర్యటించారు. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని మహిళలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. పర్యటనలో నిమ్మకాయల రంగనాగ్, ముమ్మిడి సూరిబాబు, చీకట్ల వెంకటేష్, అడ్డాల వెంకన్నబాబు, బత్సల వెంకటరమణమూర్తి, పెంకే వెంకటేష్, మునిరెడ్డి శ్రీరాములు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని 10వ క్లస్టర్ ఇన్‌చార్జి మోపూరి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోనిసుంకరపాలెం గ్రామంలో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిని వివరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

పెద్దాపురం కౌన్సిల్ సాధారణ సమావేశంలో వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న సాయిప్రసాద్

పెద్దాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కరరావు మాట్లాడుతూ బూస్టర్ పాయింట్ వద్ద పిచ్చిమొక్కలు పెరిగిపోయాయని, వాటిని తొలగించాలని చెప్పినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీంతో బూస్టర్ పాయింట్ వద్ద ట్యాంక్ బలహీన పడిందన్నారు. కొత్త ట్యాంక్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణబాపూజీ మాట్లాడుతూ పట్టణంలో వీధిలైట్లు సరిగ్గా వెలగట్లేదని, జగనన్న కాలనీలో తాగునీటి సమస్య ఉందన్నారు. భాగ్యనగర్ గ్యాస్ పైప్‌లైన్లకు సంబంధించి మున్సిపాల్టీకి రావాల్సిన బకాయిలపై కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ ప్రశ్నించారు. పట్టణంలో పార్కుల నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. కౌన్సిలర్ అరెళ్ల వీరరాఘవరావు మాట్లాడుతూ పాత పెద్దాపురంలో సరైన డ్రైనేజీలు లేవని, దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. పందుల బెడద కూడా అధికంగా ఉందన్నారు. అనంతరం పలువురు వారి వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. కమిషనరు శ్రీకాంత్‌రెడ్డి, మేనేజరు జ్యోతిరాణి, డీఈ ప్రకాశరావు, ఏఈ సుధాకర్, టీపీవో ఫణికుమార్, ఆర్వో అచ్యుతరాజు, ఆర్ఐ గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

అందరి సహకారంతో మరిడమ్మ జాతర

మహోత్సవాలు విజయవంతం

డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు



బాబుకు మరిడమ్మ చిత్రపటం అందజేస్తున్న దేవస్థానం సహాయ కమిషనరు విజయలక్ష్మి

పెద్దాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, అధికారుల సహకారంతోనే మరిడమ్మ జాతర మహోత్సవాలు విజయవంతమయ్యాయని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పేర్కొన్నారు. ఉత్సవాలను సమర్థంగా నిర్వహించిన దేవదాయ శాఖ అధికారులను ఆయన అభినందించారు. రామారావుపేట గోకులం విలేజ్‌లో ఉన్న ఆయన్ను దేవస్థానం సహాయ కమిషనరు విజయలక్ష్మి మంగళవారం కలుసుకుని అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయం వద్ద నిర్వహించనున్న భారీ అన్నదాన కార్యక్రమానికి బాబును ఆమె ఆహ్వానించారు. దేవస్థానం సిబ్బంది రమణ, క్రాంతివీర్, ట్రస్ట్ బోర్డు సభ్యులు సకురు కనకారావు, నానీ, చంద్రముఖి, రాయి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మల్లాంలో మాజీ మంత్రి కొప్పన మోహనరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

'పిఠాపురంపై కొప్పనది చెరగని ముద్ర'

పిఠాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా మాజీ మంత్రి కొప్పన మోహనరావు పిఠాపురం నియోజకవర్గంపై చెరగని ముద్ర వేశారని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు అన్నారు. కొప్పన 5వ వర్ధంతి సందర్భంగా పిఠాపురం మండలం మల్లాం గ్రామంలోని ఆయన విగ్రహానికి వారు పూలమాలలువేసి నివాళులర్పించారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా, కార్పొరేషన్ చైర్మన్లుగా పలు కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు.కొప్పన కుమారుడు శివనాథ్, మల్లాం సర్పంచ్, ఎంపీటీసీలు సూరిబాబు, కొప్పన సోమరాజు, మేళం శ్రీనివాసరావు, దుర్గపూడి సత్తిరాజు, కొప్పన కొండలరావు, బుర్రా సతీష్, బోనాసుల శివ, ములికే దివాణం, బొజ్జా సోమరాజు, జీవీ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గొంచాలలో అభివృద్ధి పనుల ప్రారంభం

సామర్లకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొంచాలలో జలజీవన్ మిషన్ నిధులు రూ.43.72 లక్షలతో నిర్మించిన తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకును పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్లను, రూ.18.50 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైన్లను డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, ముమ్మిడి సూరిబాబు చీకట్ల వెంకటేష్, మునిరెడ్డి శ్రీరాములు, రాంబాబు, అడ్డాల వెంకన్నబాబు, వింటి బాబ్జీ, పెంకే వెంకటేష్, బత్సల వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామంగా గొడారిగుంట

ఎక్సైజ్ కాకినాడ నార్త్ సీఐ రామ్మోహన్‌రావు వెల్లడి

కాకినాడ క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ పరిధిలోని గొడారిగుంటను నాటుసారా రహిత గ్రామంగా ప్రకటిస్తున్నట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ కాకినాడ నార్త్ సీఐ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన గొడారిగుంట సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. గ్రామ కమిటీ సభ్యులతో కలిసి నవోదయం 2.0 పథకంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి సారా జోలికి వెళ్లకుండా ప్రజలకు ప్రత్యామ్నాయ జీవనాధారాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల సహకారం, సమన్వయంతో గొడారిగుంటలో నాటుసారాను నిర్మూలించినట్టు వెల్లడించారు.



డాక్టర్ చంద్రశేఖర్‌కు ఆహ్వాన పత్రం అందిస్తున్న పద్మనాభం

గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఆహ్వానం

సర్పవరం జంక్షన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గోల్డెన్ జూబ్లీ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి, సంకురాత్రి ఫౌండేషన్ ఫౌండర్ 'పద్మశ్రీ' డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌కు ఆహ్వాన పత్రం అందజేసినట్టు అధ్యక్షుడు కె.పద్మనాభం, సెక్రటరీ నూకరాజు తెలిపారు. అక్టోబరులో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరగా తప్పకుండా వస్తానని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

కరప, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురంలో మిరియాల చంద్రశేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పంతం నానాజీ పరామర్శించారు. జన సైనికులు సమీకరించిన రూ.50వేలును చెక్కు రూపంలో బాధిత కుటుంబానికి అందజేశారు. నాయకులు కొండేపూడి దొరబాబు, నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలు

తాళ్లరేవు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మెదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 31వ తేదీ వరకు సమయం ఉందని, ఎంత మందినైనా చేర్చుకుంటామని ప్రిన్సిపాల్ వెంకటసత్యనారాయణ మంగళవారం తెలిపారు. హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరడానికి ఆసక్తి గల వారు కళాశాల యాజమాన్యాన్ని సంప్రదించాలని కోరారు.

పి.మల్లవరంలో

'పొలం పిలుస్తోంది'

తాళ్లరేవు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగులో సరైన పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయాధికారి ప్రశాంతి కోరారు. మంగళవారం పి.మల్లవరంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయంలో ముందు సాగాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను ధూళిపూడి వెంకటరమణ వివరించారు. గౌతమి, అజయ్, ప్రియాంక, తేజశ్రీ, అజయ్, రైతులు విల్ల సత్యనారాయణ, దడాల సత్తికొండ, గుత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో

సెర్వికల్ వాక్సిన్స్ డ్రైవ్

కాకినాడ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ కాకినాడ ఆధ్వర్యాన మహేష్‌బాబు ఫౌండేషన్ సౌజన్యంతో సెర్వికల్ వాక్సిన్స్ డ్రైవ్ ప్రాజెక్టు, ఐఎస్‌సీసీఎం, ఐఎంఏ, ఏఆర్‌సీఎఫ్ సౌజన్యంతో సీపీఆర్ ట్రైనింగ్ ప్రాజెక్టు చేపట్టారు. నగరంలోని ఎ-కన్వెన్షన్ హాలులో జరిగిన సమావేశానికి రోటరీ క్లబ్ కాకినాడ అధ్యక్షుడు తాడాల బుజ్జి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి విచ్చేశారు. తొలుత జేఎన్టీయూకే వీసీ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ రోటరీ క్లబ్ సభ్యత్వాన్ని రోటరీ పూర్వ గవర్నర్ లక్కరాజు టిక్కు, డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కల్యాణచక్రవర్తి సమక్షంలో స్వీకరించారు. క్లబ్ మెంబర్ రవితేజ రావు రోటరీ ఫౌండేషన్‌కు, గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్‌కు 1000 డాలర్ల చెక్కును క్లబ్ అధ్యక్షుడు, డిస్ట్రిక్ట్ గవర్నర్‌లకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గోడే సత్య, అసిస్టెంట్ గవర్నర్ సురబి శారద, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌లు, రోటరీ క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదిత్యలో దంత వైద్య శిబిరం

గండేపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆదిత్య విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో క్రౌన్ డెంటల్ క్లినిక్, రాజమండ్రి వారి సహకారంతో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ శిబిరం ముఖ్యంగా విద్యార్థులు, బోధన మరియు బోధనేతర సిబ్బందికి దంత పరీక్షలు నిర్వహించి తగు సూచనలు సలహాలు అందించి అవసరమైన వారి కి పేస్ట్ మౌత్ ఫ్రెష్ మందులు అందజేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి ప్రజ్ఞ

మోతుగూడెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం కొత్తపల్లి పంచాయతీ సుకుమామిడిగ్రామంలో మంగళవారం మోతుగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి ప్రజ్ఞ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో విజృంభిస్తున్న మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు మంగళవారం జ్వరాలతో ఉన్నవారి నుంచి రక్తపూతలు సేకరించారు. వైద్య సిబ్బంది సుకుమామిడి గ్రామంలో ఇంటింటా సర్వే చేపట్టి మందులు అందజేశారు. పరిసరాల పరిశుభ్రతపై, దోమ తెరలు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గ్రామాలలో కళాజాత

మోతుగూడెం, జూలై29 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో ఎస్సీ కాలనీ, సుకుమామిడి గ్రామాలలో కళాజాత నిర్వహించారు మంగళవారం చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభారత్ ఆదేశానుసారం వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య, రాజమహేంద్రవరం పీఎస్ఆర్ రూరల్ మీడియా కళాజాత బృందం వారిచే ఆరోగ్య విషయాలపై డెంగ్యూ, మలేరియా, డయేరియా వివాహ వయస్సు గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వీటిపై వీధినాటిక ద్వారా హాస్యవల్లరి జానపద గీతాలతో కళాజాత నిర్వహించారు. ఇందులో మోతుగూడెం పీహెచ్‌సీ డాక్టర్, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రజ్ఞ నఫియా ఏఎన్ఎంలు మంగమ్మ తదితరులు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఆశ వర్కర్ల ఎంపిక


అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఖాళీగా ఉన్న 33 ఆశ వర్కర్ల పోస్టులకు ఇంటర్వ్యూలుపారదర్శకంగా నిర్వహించినట్లు సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ తెలిపారు. మంగళవారం ఆమె కమిటీ సభ్యులు ఏడీఎంహెచ్‌వో డేవిడ్, వైద్యాధికారిణి శిరీష, సీడీపీవో జి.కుసుమ, డీఎల్‌పీవో నరసింహరావులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 93మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూ ద్వారా 33 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు సత్కారం


రామును సత్కరిస్తున్న టీడీపీ స్టేట్ అడ్వైజర్ శ్రీనివాస్

కూనవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మంగా చేపడుతున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న హెచ్ రామును టీడీపీ కార్యాలయంలో సన్మానించారు. టీడీపీ స్టేట్ అడ్వైజర్ చెల్లుబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కూనవరం మేజర్ పంచాయతీలో వందకు వందశాతం తన లక్ష్యాన్ని పూర్తిచేసి రాము పలువురుకు ఆదర్శంగా నిలిచాడని ఆయన అన్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ టీడీపీ ప్రతినిధి ఎడవల్లి భాస్కర రావు, టీడీపీ మండలాధ్యక్షుడు బారపాటి ప్రకాష్ మాజీ మండల అధ్యక్షుడు గడేసులు ప్రేమ్ చంద్, చలకాని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

'సుపరిపాలనే లక్ష్యం'

చింతూరు, జూలై29(ఆంధ్రజ్యోతి): సుపరిపాలన ఒక్క బీజేపీతోనే సాధ్యమని చింతూరు మండల బీజేపీ అధ్యక్షుడు కట్టం ముత్తయ్య పేర్కొన్నారు. మంగళవారం పెద్దసీత నపల్లిలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో సాగిన సుపరిపాలన అంశంపై ఇంటింటి ప్రచారం చేశారు. పేదలకు ఉచిత బియ్యం, పక్కాగృహాల మంజూరు తదితర సంక్షేమ పథకాల అమలుతీరుని నాయకులు వివరించారు. జాతీయ భద్రత, యువశక్తి వినియోగం, ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా ప్రధాని మోదీ పరిపాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు డీవీఎస్ రమణారెడ్డి, మూట మల్లేష్, మడివి చంద్రరావు, శ్యామల జోగారావు, శ్యామల లక్ష్మణరావు, మడివి లక్ష్మయ్య, మిడియం ప్రసాద్, సోడి చంటి, వంజం సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఘనంగా నవోత్సవాలు జరుపుకుందాం'


సమావేశంలో మాట్లాడుతున్న కుంజా శ్రీను

చింతూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 9న జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరుపుకుందామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను పేర్కొన్నారు. ఈమేరకు ఆగస్టు ఒకటి నుంచి తొమ్మిది వరకు నవోత్సవాలు జరుపుకోవాలన్నారు. ఈమేరకు ప్రతి ఆదివాసీ గూడెంలో ఇంటింటా ఆదివాసీ జెండా ఎగురవేయాలన్నారు. ఆదివాసీ హక్కులను కాపాడుకోవడం, జాతిని సంరక్షించుకోవడమే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జల్లి నరేష్, శీలం తమ్మయ్య, మడివి రాజు, కాక సీతారామయ్య, మడివి సాయి, మడివి మీనాక్షి పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

కూనవరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి):సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ డివిజన్ నాయకులు పిలుపునిచ్చారు. ఆగస్టు 8, 9 తేదీల్లో జరిగే ఈ కార్యక్రమంలో ప్రతిఒక్క కార్యకర్త పాల్గొనాలని వారు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏజెన్సీలో ఖనిజ సంపదను దోచుకుంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి గుజ్జమోహన్‌రావు మండల కార్యదర్శి లంబు శ్రీను, డివిజన్ నాయకులు జుత్తుక సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు సీఐగా బాధ్యతలు చేపట్టిన గోపాలకృష్ణ



చింతూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చింతూరు సీఐగా చిత్రాడ గోపాలకృష్ణ నియమితులైన విషయం విదితమే. మంగళవారం ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. గోపాలకృష్ణ మారేడుమిల్లి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన సీఐ దుర్గాప్రసాద్‌ని పాడేరు మహిళా పోలీసు స్టేషన్‌కు బదిలీ అయిన విషయం తెల్సిందే.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అసమానతలు లేని నవ సమాజానికి పీ-4 దోహదం

● ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ యనమల దివ్య

తునిరూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి):అసమానతలు లేని నవ సమాజానికి పీ-4 దోహదపడుతుందని ప్రభుత్వ విప్ తుని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో ఆర్థిక అసమానతలను రూపుమాపి, ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజాభాగ్యస్వామ్యంతో 2047 స్వర్ణఆంధ్ర లక్ష్యంగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పీ-4కు రూపకల్పన చేసిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యసాధనలో తుని నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ప్రణాళికలను సిద్ధంచేసి అటు ప్రభుత్వ అధికారులు, ఇటు ప్రైవేటు, ప్రజా భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. 20శాతం పేదలను 10శాతం ధనికులతో అనుసంధానం చేయడం ద్వారా నిరుపేదలను పేదరికం నుంచి బయటకు తీసుకునిరావాలన్న ప్రభుత్వ సంకల్పంతో తుని నియోజకవర్గాన్ని ముందు వరుసలో నిలిపేందుకు సమిష్టిగా పనిచేద్దామన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా పీ4 కార్యక్రమం కింద బంగారు కుటుంబాల దత్తతకు సంబంధించి ఎంపికైన పేదకుటుంబాల జీవన స్థితిగతులు మెరుగుపరిచే బాధ్యతలను 24 ప్రభుత్వశాఖలకు అప్పగించిన నేపథ్యంలో ఎమ్మెల్యే యనమల దివ్య అధికార యంత్రాగానికి మార్గనిర్దేశం చేశారు. తుని నియోజకవర్గంలో 13వేల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు ఇప్పటివరకు 1700మంది మార్గదర్శకులు ముందుకు రావడంపై ఎమ్మెల్యే యనమల దివ్య హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 13,219 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు తుని టౌన్ తోపాటు మూడు మండలాల నుంచి నాలుగువేల మంది మార్గదర్శకులను నియమించాలని సూచించిన ఆమె ఇప్పటికే 1700 మంది పీ4లో భాగస్వామం అయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో యనమల రాజేష్, చింతం నీడి అబ్బాయి, నార్ల భువన సుం దరి, అంకంరెడ్డి రమేష్, ఇనుగంటి సత్యనారాయణ, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, కుసుమంచి సత్యనారాయణ, దండెం రామకృష్ణ, పెనుమచ్చ నాగేశ్వరరావు, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, చొక్కా అప్పారావు, నరహరశెట్టి సూ ర్యప్రకాష్, దంతులూరి శ్రీనివాసరాజు, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, తహశీల్దార్ జి.ప్రసాదరావు, ఎంపీడీవో సాయి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రోత్సాహకాలను పామాయిల్ రైతులు వినియోగించుకోవాలి'


మల్లేపల్లిలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాస్

తొండంగి,జూలై 29 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకుని ఆర్థికంగా లాభపడాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. మంగళవారం పైడికొండ గ్రామంలో జరిగిన పామాయిల్ విస్తరణ మేళాలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు మొక్కల దగ్గర నుంచి ఎరువులు, వినియోగించే పరికరాలతోపాటు, నీటి అవసరాలు తదితర అనేక విధాలైనరాయితీలు కల్పిస్తోందన్నారు. వీటిని వినియోగించుకుని రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసి ఆర్థికంగా ఎదగాలన్నారు, గతంలో కంటే నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. రైతులకు అన్నివిధాలా కూటమి ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. అనేక పథకాల ద్వారా రైతులకు మేలు చేస్తోందన్నారు. ఆగస్టు 2న రైతుల ఖాతాలలోకి నగదు బదిలీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి నాగసోమరాజు, జిల్లా ఉద్యాన వనశాఖాధికారి విజయలక్ష్మి, మైక్రో ఇరిగేషన్ అధికారి వరప్రసాద్, పతంజలి పట్టాభి, హార్టికల్చర్ అధికారి సుజాత, జిల్లా మేనేజర్ రవీంద్రతోపాటు రైతులు పాల్గొన్నారు.

'పంటకు బీమా తప్పనిసరి'

శంఖవరం: ప్రతీ రైతూ తమ పంటలకు బీమా తప్పకుండా తీసుకోవాలని వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని, అన్నవరం గ్రామాలలో వరి నారుమడులను పరిశీలించి రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఎకరాకు రూ.760 చెల్లించి పంటకు బీమా చేయించవచ్చునని, బ్యాంకులో రుణంలేని రైతులకు ఇది వర్తిస్తుందని తెలిపారు. 80 శాతం రాయితీతో డ్రోన్లను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

మల్లేపల్లిలో పొలం పిలుస్తోంది

గండేపల్లి: మండలంలో మల్లేపల్లిలో మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ అధ్యక్షతన మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఏడిఏ జి.శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వరి నారుమడులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల యాజమా న్యం గురించి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో పి.చంద్రమౌళి, తదితరులు ఉన్నారు.

నిత్యావసర వస్తువుల అందజేత


నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

జగ్గంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సముద్ర ఫ్లెక్స్ అధినేత గణేష్ ఆర్థిక సాయంతో పేద కుటుంబానికి నిత్యావసర వస్తువులు సమకూర్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి ముఖ్య అతిథిగా హాజరై శ్రీను కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందజేశారు. సుంకర సతీష్, సీనియర్ రిపోర్టర్ రాజు, సముద్ర ఫ్లెక్స్ ప్రింటింగ్ స్టాఫ్, గణేష్ ట్రెండ్ సర్కిల్ పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గం జగ్గంపేట పట్టణం స్థానిక పాత పోలీస్‌స్టేషన్ ఆవర ణలో జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మ లపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని జగ్గంపేట నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ క్యాంటీన్‌ని ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో మాధవు వీరబాబు, సూరం పాలెం బాలు, కురుమల్ల నాగేశ్వరావు, మరిసే రామకృష్ణపాట్టంశెట్టి రమేష్, గందం శ్రీను, కనకరాజు, అరినే రాజేష్, పాలెం బాబీ, చల్లా రాజ్యలక్ష్మి, గండికోట శ్రీను, శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి కాలుష్యం అరికట్టండి

ఏలేశ్వరం, జూలై29(ఆంధ్రజ్యోతి): నేడు నాటిన మొక్కలే రేపటి తరానికి ప్రాణాధారమని నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు సఖిరెడ్డి విజయబాబు నేతృత్వంలో మంగళవారం నర్సీపట్నం రోడ్డులో రహదారికి ఇరువైపు లా మొక్కలు నాటారు. ఏఈ సూర్యనారాయణ, గోళ్ల నాగేశ్వరరావు, తిరగటి సత్యనారాయణ, రౌతు సహదేవుడు, కోరాడ నారాయణరావు, వంశీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

5.84లక్షల పని దినాలు పూర్తిచేయాలి

ప్రత్తిపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఉపాధిహామీ పథకంలో శ్రామికులకు 5.84 లక్షల పనిదినాలు ఈ ఏడాది పూర్తిచేయాలని ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల ఉపాధి హామీ పథ కం సిబ్బంది సమావేశానికి ఏపీవో కుమార్ స్వామి అధ్యక్షత వహించారు. సమావేశంలో పా ల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ 1.86లక్షల పని దినాలు శ్రామికులకు కల్పించామన్నారు. మిగిలిన 4లక్షల పనిదినాలు వచ్చే మార్చి నెలాఖరునాటికి క్షేత్రస్థాయిలో సిబ్బంది పనులు కల్పించాలన్నారు. కాలానుగుణమైన పనులను హార్టికల్చర్‌కు ప్రో త్సాహం ఇచ్చేలా పక్కా ప్రణాళికతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీ డీవో కోరారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ పథకం సీసీలు, పీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తొండంగి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. తొండంగి గ్రామానికి చెందిన కొడవటి ఆనంద రావు (55) అనే వ్యక్తి ఆర్థిక బాధలు అనారోగ్య సమస్యల కారణంగా ఈనెల 28న గడ్డి మందు తాగడంతో అతనిని తుని ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య నాగమణి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

టీడీపీలో పలువురు చేరిక


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న యనమల దివ్య

తొండంగి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పైడికొండ గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు సర్పంచ్ నరిసే సత్యవతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యనమల దివ్య సమక్షంలో టీడీపీలో చేరారు. మంగళవారం పైడికొండలో బీసీ ఎస్సీ కాపు సామాజికవర్గానికి చెందిన పలువురు పార్టీలో చేరగా వీరికి ఎమ్మెల్యే దివ్య, యనమల రాజేష్‌లు పార్టీ కండువాల కప్పి సాదరంగా ఆహ్వానించారు. నరిసే మణి, శివమ్మ, సురేఖ, దేవి, వరలక్ష్మి, దుర్గా, అన్నెం రోహిణి, మర్రి శ్రావణి, జ్యోతి, నరిసే రామలక్ష్మి, మునికోటి గోవిందు, బత్తుల శివ, భనుప్రసాద్ బండారు గోవిందు, పెంటయ్య, భానుప్రసాద్ తదితరులు పార్టీలో చేరారు.

'గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి'

తునిరూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గురుకులాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. లోవకొత్తూరు గ్రామంలో అంబేడ్కర్ బాలుర వసతి గృహంలో తాగునీటి, విద్యుత్ సమస్యలపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి వినతిపత్రం అందజేశారు. ఏళ్ల తరబడి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా వారి సమస్యలు పరిష్కారంకాలేదని, కూటమి ప్రభుత్వం చొరవచూపి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తుమ్మలపల్లి కుమార్, ఆరుగల రమేష్, జిత్తుకు రాజు ఉన్నారు.

ముద్రగడ కోలుకోవాలని అభయాంజనేయస్వామికి పూజలు

ప్రత్తిపాడు, జూలై29 (ఆంధ్రజ్యోతి):మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని ఆయన అభిమానులు, కార్యకర్తలు మంగళవారం ప్రత్తిపాడులో పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి వెంకటరత్నం, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఏడిద రెడ్డినాయుడు, మాజీ ఉపసర్పంచ్ చిలకమర్తి వెంకటరమణ తదితరులు స్థానిక అభయాంజనేయస్వామికి పూజలు చేసి సంపూర్ణ ఆరోగ్యంతో ముద్రగడ తిరిగిరావాలని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో శేరుకృష్ణ, గోళ్ళ శేఖర్‌బాబు, సలాది కృష్ణ పాల్గొన్నారు. వాకపల్లిలోని ధారా మల్లికార్జునస్వామి ఆలయంలో గిరిజనులు ముద్రగడ ఆరోగ్యం కోలుకోవాలని కోరుతూ మల్లికార్జున స్వామికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాపు గంగరాజు, ఇనుముల దొరబాబు, సింహాద్రికుమార్ కోరాపుచక్రం, పెద్ల సత్తిబాబు, రామిశెట్టి నాని పాల్గొన్నారు.

ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి రేపు సీబీటీ పరీక్ష

కాకినాడరూరల్, జూలై29(ఆంధ్రజ్యోతి):అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం గిన్నెపల్లిలోని ఈఎం ఎయిడెడ్ యూపీ స్కూలులో ఖాళీగా ఉన్న ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)ను గురువారం నిర్వహించనున్నట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకున్న వారుహాల్‌టికెట్లను https://cse.ap.gov.in/Aided Recruitment Notificationsలో డౌన్‌లోడ్ చేసుకోవాలని, నేరుగా దరఖాస్తుచేసుకున్న వారు కాకినాడ డీఈవో కార్యాలయంలో పొందవచ్చన్నారు. గ్రేడ్-2 (హెచ్‌పీ, టీపీ, ఎస్ఏ(ఎం)) ఉద్యోగాలకు ఉదయం 9.30నుంచి 11.30 గంటల వరకు, ఎస్జీటీ ఉద్యోగాలకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు కాకినాడ అచ్యుతాపురం రైల్వేగేట్ సమీపంలోని అయాన్ డిజిటల్ పరీక్ష జరుగుతుంది. హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కలిగిన ధ్రువపత్రంతో ఒక గంట ముందుగా హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 87127 14799 నెంబర్లో సంప్రదించాలన్నారు.

'పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి'

తొండంగి, జూలై29 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించి పారిశుధ్యం మె రుగుకు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణాధికారి వీవీఎస్ లక్ష్మణ్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన ఐవీఆర్ఎస్‌లో దిగువస్థాయిలోఉన్న ఏ.కొత్తపల్లి గ్రామాన్ని సందర్శించి పారిశుధ్యం పరిశీలించారు. ముందుగా ఆయన సమీపంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఇళ్లవద్ద ఉన్న చెత్తను ఏవిధంగా చేస్తున్నారన్న విషయమై ప్రశ్నించారు. తడి, పొడి చెత్త వినియోగంపై అవగాహన కల్పించారు. చెత్తనుం చి సంపద తయారీ కేంద్రంద్వారా ప్రజల నుంచి సేకరించే చెత్తద్వారా ఏవిధంగా ఆదాయం సమకూరుతుందో వివరించారు. అనంతరం ఆయన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని, వర్మీ కంపోస్టు యూనిట్‌ను పరిశీలించారు. ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయన పంచాయతీ, ఉపాధి హామీ, వైద్య సిబ్బందితో సమావేశమై పారిశుధ్యంపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఇన్చార్జి ఎంపీడీవో సాయినవీన్, ఇన్‌చార్జి ఈవోపీ ఆర్డీ ప్రేమ్‌కుమార్, గ్రామకార్యదర్శి జి.రాము, సర్పంచ్ బెక్కం రాజవరలక్ష్మి చంద్రగిరి, కిరణ్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి):మండలంలో బొర్రంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న మల్లేపల్లి గ్రామానికి అలాగే గండేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గండేపల్లి, రామయంపాలెం, సింగరంపాలెం గ్రామాలకు బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్‌కిషోర్ తెలిపారు. అలాగే బొర్రంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఇండస్ట్రీయల్ ఏరియాలో కూడా విద్యుత్ ఉం డదని ప్రజలు సహకరించాలని వారు కోరారు.

రాగంపేటలో సీలింగ్ భూములను పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలి

● రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల


ధర్నా నిర్వహిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

గండేపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలో జెడ్.రాగంపేట గ్రామంలో సర్వేనెం.204లో ఉన్న ఎనిమిది ఎకరాలు సీలింగ్ భూమిని జెడ్.రాగంపేట, నీలాద్రిరావుపేటకు చెందిన దళిత, ఇతర పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నీలాద్రిరావుపేట ఇళ్లస్థలాల సమ స్యపై ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా కమిటీ ఆధ్వర్యంలో పీడీఎస్‌యూ (వి) రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా గండేపల్లి మండలం జెడ్. రాగంపేట గ్రామంలో 204 సర్వే నెంబర్‌లో సుమారు 8ఎకరాల సీలింగ్ భూమి నిరుపయోగంగా ఉందని, ఆ భూమిని జెడ్.రాగంపేట నీలాద్రిరావుపేట గ్రామాలకు చెందిన దళిత, ఇతర పేదలకు మూడేసి సెంట్లుచొప్పున ఇళ్లస్థలాలుగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి కుంచె అంజిబాబు, అధ్యక్షుడు మడికి సత్యం, రెడ్డి దుర్గాదేవి, కర్నాకుల రామలింగేశ్వరరావు, ఎల్లే సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

6న ఏలేశ్వరంలో జాబ్‌మేళా

ఏలేశ్వరం, జూలై29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థచే ఏలేశ్వరంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమా పూర్తిచేసిన నిరుద్యోగులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆగస్టు 6న వివిధ ప్రము ఖ కంపెనీలలో పనిచేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఆశక్తి గలవారు ఆధార్, ఇతర సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలతో వచ్చేనెల 6న బుధవారం ఉదయం 10గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే జాబ్ మేళాకు హాజరవ్వాలన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉద్యోగఅవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండలరావు అన్నారు. వివరాలకు సెల్ 8688977277, 8247788247కు సంప్రదించాలన్నారు.

ఆదిత్య ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు

గండేపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య కాలేజీ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వరల్డ్ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంపును రంగంపేట మండలం సుభద్రంపేట గ్రామంలో నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవిశంకర్ తెలిపారు. గ్రామస్థులకు అవసరమైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి, ఐరన్, మల్టీ విటమిన్ టాబ్లెట్లు, తదితర సుమారు రూ.20వేల విలువైన మందులను ఉచితంగా గ్రామ ప్రజలకు అందజేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

● 9 మందికి రూ.90వేల జరిమానా

ప్రత్తిపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష 9మందికి రూ.90వేలు జరిమానాను విధిస్తూ ప్రత్తిపాడు కోర్టు తీర్పు చెప్పినట్లు మంగళవారం సీఐ బి.సూర్యఅప్పారావు తెలిపారు. అన్నవరం పరిధిలో ఏడుగురు మద్యం సేవించి వాహనాలు నడపటంతో వారిని ప్రత్తిపాడు కోర్టులో హాజరుపర్చగా ఐదుగురికి రూ.10వేలు వంతున రూ.50వేలు జరిమానా ఇద్దరికి రెండు రోజులు జైలుశిక్ష విధించారని చెప్పారు. ఏలేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలునడిపిన ఇద్దరిని రూ.10వేలు వంతున రూ.20వేలు జరిమానా ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున రూ.20వేలు జరిమానా విధించారని సీఐ తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ప్రత్తిపాడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలంలో పేకాట ఆడుతున్నవారిపై ఎస్ఐ లక్ష్మీకాంతం మంగళవారం దాడులు నిర్వహించారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ప్రతిపాడు మండలం ఒమ్మంగి శివారులో పేకాట ఆడుతున్న వారిపై ఎస్ఐ లక్ష్మీకాంతం, తన సిబ్బందితో దాడి చేశారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,760 నగదు స్వాధీనం చేసుకున్నారు.

1000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

మండలంలోని తోటపల్లి గ్రామంలో మంగళవారం ఎక్సైజ్ సిబ్బంది నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 1000లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో తోటపల్లికి చెందిన కోరాకు నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను శుభ్రం చేయించండి

గండేపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం గ్రామ టీడీపీ అధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ, గ్రామ టీడీపీ నాయకులతో సందర్శించారు. ఆసుపత్రికి ప్రహరీలేకపోవటం వలన రాత్రిపూట అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, తుప్పలు బాగా పెరగడంవల్ల పాములు రావడానికి అవకాశం ఉందని, వర్షం పడినప్పుడు రోడ్డులేకపోవడంతో రోగులు లోపలికి రావడానికి నానా అవస్థలు పడుతున్నారని డాక్టర్ నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

కామ్రేడ్ నాగయ్యకు విప్లవ జోహార్లు

జగ్గంపేట, జూలై 29(ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ (విజృంభణ)విద్యార్థి నాయకుడిగా విప్లవ జీవితం ప్రారంభించిన కామ్రేడ్ మచ్చ నాగయ్య ఖచ్చితమైన విప్లవకారుడిగా నీతి, నిజాయితీలతో అమలాపురంలో అసువులు బాశారు. నాగయ్యకు ఆంధ్రప్రదేశ్ రైతు-కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు విప్లవ జోహార్లర్పించారు. ఆయన ఆదర్శాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని ప్రజలకు పిలుపునిచ్చారు.